RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక

సంచిక 22 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | జులై 21, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

## నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది

శక్రునాజ్ఞ తోడ జడివాన కురియగా
గోపకులమునంత గోసపడియె
గొడుగువోలెనెత్తి గోవర్ధన గిరిని
రక్షజేసె కృష్ణ దీక్షబూని

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

**విలేకరులు కావలెను**

నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక మరియు చైతన్యగళం ఛానెల్ లో పనిచేయుటకు మండల విలేఖర్లు, నియోజకవర్గ,జిల్లా ఇంచార్జీలు, క్రైమ్ రిపోర్టర్లు కావలెను.

**పూర్తి వివరాలకు**

తెలంగాణ - 9705770909,
ఆంధ్రప్రదేశ్ -9491163914
లను సంప్రదించగలరు.

## పామాయిల్ పెంపకం రైతులకు ఎంతో మేలు

- వర్షాభావంలోనూ పంటరకు ధోకా లేదు
- పామాయిల్ ధరల పెంపునకు కృషి చేస్తున్నాం
- అంజనాపురంలో గోద్రేజ్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం
- మంత్రి తుమ్మలతో కలసి ప్రారంభించిన భట్టి



**ఖమ్మం,జులై 20 :** పామాయిల్ ధర పెంపునకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లా వ్యవసాయంపై ఆధారపడిన జిల్లా అని పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అంజనాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సి ఉందని.. వివిధ కారణాలతో సీఎం రాలేకపోయారని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా రైతులకు సీఎం రేవంత్‌రెడ్డి తన శుభాకాంక్షలు తెలిపారని అన్నారు. అంజనాపురంలో ఆయిల్ పామ్ కాంప్లెక్స్ నిర్మించిన గోద్రెజ్ సంస్థకు భట్టి విక్రమార్క కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి విశేషంగా కృషిచేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి అభినందనలు చెప్పారు. ఖమ్మం జిల్లా రైతన్నలు అన్ని రకాల పంటలు సాగు చేస్తారని వెల్లడించారు. తాను ఎన్నో రకాల పంటలు సాగు చేశానని ఏ పంటకు రాని దిగుబడి ఆయిల్ పామ్‌కు వచ్చిందని మంత్రి తుమ్మల స్వయంగా తనతో చెప్పారని అన్నారు. చివరకు మిగతా2లో...




## మేడిగడ్డ మరమ్మతులకు రంగం సిద్ధం...

- చివరి దశకు చేరుకున్న పరీక్షలు
- నిపుణుల నివేదికల ఆధారంగా పునరుద్ధరణ పనులు
- భద్రతా అనుమతుల తర్వాతే బ్యారేజీల నిర్వహణ
- శాస్త్రీయ విధానంతో కాళేశ్వరం బ్యారేజీల పునరుజ్జీవనం
- నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

## నేడు,రేపు కొడంగల్‌లో సిఎం పర్యటన




## సజావుగా పార్లమెంట్ సమావేశాలు సాగాలి


- దేశం అనేక విజయాలను నమోదు చేస్తోంది
- విక్రమ్ విజయవంతం..యువకుల నైపుణ్యం
- పార్లమెంట్ ముందు మీడియాతో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ,జులై 20 :** పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగేలా చూడాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యా నించారు. ఈ సమావేశాలు జరుగుతా యని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా మోడీ మీడియాతో మాట్లాడారు. గత నెల రోజులుగా దేశంలో అనేక పరిణామాలు జరిగాయని వెల్లడించారు. అంతరిక్ష ప్రస్థానంలో నవశకం ప్రారంభమైందని తెలిపారు. స్టార్టప్ కంపెనీ మిగతా2లో...

## పోలీస్ సిబ్బంది సంక్షేమమే లక్ష్యం

- వెల్ఫేర్ సొసైటీ సమీక్షలో డిజిపి సివి ఆనంద్



**హైదరాబాద్,జులై 20 :** పోలీసు సిబ్బంది, వారి కుటుంబాల సంక్షేమమే తెలంగాణ పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్స్పష్టం చేశారు. డీజీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ వెల్ఫేర్ సొసైటీ , ఆరోగ్య భద్రత విభాగాల సమీక్ష సమావేశంలో సంక్షేమ పథకాల అమలు, వాటి పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది జీవన ప్రమాణాలను మిగతా2లో...



## క్షేత్ర స్థాయి పర్యటనలకు పవన్ కళ్యాణ్ దూరం?

మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచే విధి నిర్వహణ

**అమరావతి,జులై 20 :** ఇటీవల కుడి భుజానికి శస్త్ర చికిత్స చేయించుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ అధికారిక కార్యక్రమాలకు అందుబాటులోకి రావాలని నిర్ణయించుకు న్నారు. ఈ మేరకు పిఠాపురం, పార్వతీపురం మన్యం జిల్లాలో ని పెదపెంకి గ్రామం, రాజమహేంద్రవరం మిగతా2లో...

## 1న మోడీ చేతుల మీదుగా భోగాపురం విమానాశ్రయం ప్రారంభం

- నిర్మాణ పనులు పూర్తి కావడంతో ప్రారంభానికి ఏర్పాట్లు
- ప్రధాని పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన మంత్రులు అని, శ్రీనివాస్



**విజయనగరం, జూలై 20:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆగస్టు 1న భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారం భిస్తారని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఈ మేరకు ప్రధాని పర్యటన ఏర్పాట్లను అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, మిగతా2లో...

## యువతపై లాఠీచార్జీ..స్పందించిన రాహుల్ గాంధీ






## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లు

- ప్లాట్ల కోసం పది వరకు దరఖాస్తుల స్వీకరణ
- రూ.10 వేలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి
- ఇందిరమ్మ ఇళ్ల బ్రోచర్ ఆవిష్కరించిన మంత్రులు

**హైదరాబాద్,జులై 20 :** క్యూర్ పరిధిలో ప్లాట్ల కోసం ఆగస్టు 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మీ సేవ, వాట్సాప్, వెబ్‌సైట్‌లో వీటికోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. రూ.10వేల టోకెన్ చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డ్రా పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని స్పష్టం చేశారు. డ్రాలో ఇల్లు రానివారి డబ్బులు వెంటనే చెల్లిస్తామని వెల్లడించారు. ఆయా ప్లాట్లు పదేళ్ల పాటు అమ్మరాదని.. అద్దెకు మిగతా2లో...

## జెపి నడ్డాతో కాక్రోచ్ జనతా ప్రతినిధుల భేటీ

- పరీక్షల నిర్వహణా లోపాలపై ప్రశ్నలు
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు పట్టు
- పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందచేత
- దీక్ష విరమిస్తున్నట్లు సోనమ్ వాంగ్‌చుక్ వెల్లడి



**న్యూఢిల్లీ,జులై 20 :** నీట్, ఇతర పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధులు కేంద్ర మంత్రి జేపీ నడ్డాను కలిశారు. ఈ మేరకు పలు డిమాండ్లతో కూడిన ఓ లేఖను ఆయనకు అందజేశారు. సీజేపీ అధికార ప్రతినిధులు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకా సుమారు మిగతా2లో...

## ప్రభుత్వాసుపత్రుల్లో రక్షణ లేకుండా పోయింది

- ఇందిరమ్మ పాలనలో బాలింతకు కూడా భరోసా లేదు
- బాన్సువాడ ఘటనపై స్పందించన ప్రభుత్వం
- నిమ్స్‌లో బాలింతను పరామర్శించిన హరీష్ రావు



**హైదరాబాద్,జులై 20 :** ఇందిరమ్మ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. బాన్సువాడ మాతా శిశు ఆస్పత్రిలో చికిత్స వికటించి, నిమ్స్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాలింతలను హరీశ్‌రావు పరామర్శించారు. అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఘటన జరిగిన పది రోజులవుతున్నా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదని మండిపడ్డారు. ఇంత జరిగినా ప్రభుత్వం ఎందుకు విచారణ జరపడం లేదని ప్రశ్నించారు. బాధ్యులైన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐదుగురు బాలింతలు నిమ్స్‌లో చికిత్స పొందుతున్నార హరీశ్‌రావు తెలిపారు. వీరిలో ముగ్గురు డయాలసిస్‌పై ఉన్నారని పేర్కొన్నారు. తెల్లరక్తకణాలు తగ్గాయి.. కిడ్నీ, లంగ్స్ ఇన్‌ఫెక్షన్లతో మిగతా2లో...

మంగళవారం,
జూలై 21, 2026

RNI - TELTEL/2023/87644
నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక



# సజావుగా పార్లమెంట్ సమావేశాలు సాగాలి

(మొదటి పేజీ తరువాయి)

తయారు చేసిన విక్రమ్-1 రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లిందని వివరించారు. సోమవారం పార్లమెంట్ దగ్గర మీడియాతో ప్రధాని మాట్లాడారు. భారత అంతరిక్ష ప్రస్థానంలో కీలక ఘట్టం ఆవిష్కృతమైందని ఉద్ఘాటించారు. భారతదేశ యువత అంతరిక్షంలోకి దూసుకుపోయిందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. విక్రమ్-1 విజయం వెనుక యువత పాత్ర కీలకమని తెలిపారు. స్కైరూట్ విజయవంతం అవడం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. అదే సమయంలో అంతరిక్ష రంగ స్టార్టప్ స్కైరూట్ 'విక్రమ్-1' ప్రయోగం విజయవంతం అవడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. 28 ఏళ్ల సగటు వయసున్న ఆవిష్కర్తలదే ఈ ఘనత అని కొనియాడారు. 'ఏడాది కాలంలో ఎన్నో గొప్ప విషయాలు జరిగాయి. అంతరిక్షంతో సహా వేదిక ఏదైనా.. మనం సాధించిన విజయాలు దేశానికి గర్వకారణం. గత సంవత్సరం వర్షాకాల సమావేశాలకు ముందు ఒక భారతీయ పౌరుడు శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్నారు. ఇప్పుడు ఒక భారతీయ స్టార్టప్ స్కైరూట్ అద్భుతమైన ఘనత సాధించిందని మోదీ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి పరోక్షంగా చురకలంటించారు. భారత యువత అంతరిక్షంలో ఒక కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. ప్రపంచంలోని కొన్ని దేశాల్లో మాత్రమే ఇలాంటి ప్రైవేటు సంస్థలు ఉన్నాయి. స్కైరూట్ స్టార్టప్ బృందం సగటు వయసు 28 ఏళ్లని నాకు తెలిసింది. ఇక్కడ నేను 56 ఏళ్ల యువకుడి గురించి మాట్లాడటం లేదని పరోక్షంగా రాహుల్‌ను ఉద్దేశించి మోదీ అన్నారు. యువత సాధించిన ఈ విజయం యాదృచ్ఛికం కాదు. మన దేశ యువత సామర్థ్యం, ఆకాంక్షలు అంతరిక్షం వలే హద్దుల్లేనివని చెప్పే సందేశం ఇదని ప్రధాని ప్రశంసించారు. రాజస్థాన్‌లో అతిపెద్ద ఆయిల్ రిఫైనరీని దేశానికి అంకితం చేశామని వెల్లడించారు. ఒక సెమీ కండక్టర్ ప్లాంట్, గ్రీన్ హైడ్రోజన్ రైలును ప్రారంభించామని తెలిపారు. యుద్ధంతో చాలా దేశాలకు నష్టం జరుగుతోందని చెప్పారు. చమురు ధరలు అమాంతం పెరుగుతు న్నాయని తెలిపారు. 7.7శాతం గ్రోత్‌రేట్ భారత్ నమోదు చేస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధాని నరేంద్రమోదీ దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. 'వర్షాకాలం, వర్షాకాల సమావేశాలు.. ఈ రెండు చురుగ్గా ఉంటే ఫలితాలు గొప్పగా ఉంటాయి. అప్పుడే దేశం సంక్షేమంగా ఉంటుంది. అందుకే ఈ రెండూ మెరుగ్గా ఉండాలని కోరుకుంటున్నాను' అని మోదీ తెలిపారు. గందరగోళ పరిస్థితులకు తావులేకుండా పార్లమెంట్ ఉభయ సభల్లో చర్చలు జరగాలని ఆకాంక్షించారు.

# పామాయిల్ పెంపకం రైతులకు ఎంతో మేలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రకృతి విపత్తులను కూడా ఈ పంట తట్టుకొని నిలబడుతుందని చెప్పుకొచ్చారు. పామాయిల్ సాగు చేసిన రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వెల్లడించారు. దేశంలో 25 లక్షల మిలియన్ టన్నుల పామాయిల్ అవసరం ఉందని తెలిపారు. దేశంలో కేవలం 12 లక్షల మిలియన్ టన్నుల పామాయిల్ మాత్రమే ఉత్పత్తి అవుతుందని చెప్పుకొచ్చారు. 1992లో ప్రారంభించిన పామాయిల్ సాగు ఇప్పటికి దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా నిలిపే స్థాయికి వచ్చిందని భట్టి విక్రమార్క వివరించారు. గతంలో పామాయిల్ టన్ను గెల ధర రూ.12000లు ఉంటే.. నేడు టన్ను ధర రూ.23 వేలకు పెరిగిందని వెల్లడించారు. అంజనాపురంలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం.. ఖమ్మం జిల్లా అన్నదాతలకు ఓ వరమని ఉద్ఘాటించారు. వ్యవసాయ ఉత్పత్తుల పరిశ్రమలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా వేదిక కాబోతోందని తెలిపారు. రాబోయే రోజుల్లో అనేక రకాల పరిశ్రమలు ఇక్కడికి రాబోతున్నాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. జిల్లాలో గోద్రెజ్ కంపెనీ ఆయిల్ పామ్ కాంప్లెక్స్ నిర్మించడం సంతోషంగా ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఈ కాంప్లెక్స్‌లో అత్యాధునిక సీడ్ గార్డెన్ ఏర్పాటు చేశారని తెలిపారు. గోద్రెజ్ కంపెనీకి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని, రైతులకు అన్ని విధాలా అందుబాటులో ఉండేలా కంపెనీ సేవలందించాలని ఆకాంక్షించారు. ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ ముందు ఉందని మంత్రి తుమ్మల తెలిపారు. రాష్ట్రంలో పది లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు కృషి జరుగుతోందని చెప్పారు. ఈ సందర్భంగా రైతులంతా ఈ పంట సాగుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయిల్ పామ్‌తో ఎలాంటి నష్టం ఉండదన్నారు. ఆయిల్ పామ్ కింద ఇప్పటికే మూడు ఫ్యాక్టరీల నిర్మాణం పూర్తయిందని, మరో ఆరు ఫ్యాక్టరీల నిర్మాణం జరుగుతోందని వెల్లడించారు. తెలంగాణ భూములు ఆయిల్ పామ్ సాగుకు అనుకూలమని మంత్రి పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో అన్ని జిల్లాల్లో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీల నిర్మాణం జరగాలన్నదే తన లక్ష్యమని చెప్పుకొచ్చారు. దక్షిణ భారతదేశ నేతలందరూ ఆయిల్ పామ్ దిగుమతిపై సుంకం తగ్గించాలని కోరుతున్నామని మంత్రి చెప్పారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నామని, ఆయిల్ పామ్ సాగుతో వారి జీవితాల్లో వెలుగులు నింపుతామన్నారు మంత్రి తుమ్మల. తన యాభై సంవత్సరాల వ్యవసాయ అనుభవంలో ఎన్నో పంటలు పండించామని, ఏ పంటకు రాని ఆదాయం దీనికి వస్తుందన్నారు. ఆయిల్ పామ్‌ను ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన నాటి నుంచి తాను కూడా సాగు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మరోవైపు, ఎల్‌నినో ప్రపంచాన్ని కబళించే పరిస్థితి ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. దాని కారణంగా రుతుపవనాలు సరిగా రాలేదని, మానవజాతి చేసిన విధ్వంసం తిరిగి మన పాలిటే మహమ్మారిగా మారిందన్నారు. దక్షిణ భారతదేశంలో ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉందని, ఉద్యానవన పంటల సాగుతో భూములను చల్లబరచాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

# మేడిగడ్డ మరమ్మతులకు రంగం సిద్ధం...

**హైదరాబాద్,జులై 20 :** కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. బ్యారేజీలపై నిర్వహిస్తున్న సమగ్ర శాస్త్రీయ పరీక్షలు చివరి దశకు చేరుకున్నా యని, వాటి ఆధారంగా మరమ్మతులు, పునరుద్ధరణకు అవసరమైన డిజైన్ల రూపకల్పన జరుగుతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, బ్యారేజీల పునరుద్ధరణలో ప్రభుత్వం పూర్తిగా శాస్త్రీయ విధానాన్నే అనుసరిస్తోందని స్పష్టం చేశారు. నిపుణులు భద్రతపై పూర్తి స్థాయిలో ధ్రువీకరించే వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను తిరిగి నిర్వహణలోకి తీసుకురాబోమని వెల్లడించారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ , నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వంటి దేశంలోని అత్యున్నత సాంకేతిక సంస్థలు నేల స్వభావం, పునాదులు, కాంక్రీట్ నిర్మాణం, ఇతర నిర్మాణ భాగాలపై విస్తృత స్థాయిలో పరీక్షలు నిర్వహించాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఆ పరీక్షలు దాదాపు పూర్తయ్యాయని, వాటి ఫలితాలను ఐఐటీ బొంబాయికి పంపించగా, అక్కడ నిపుణులు సమగ్ర పునరుద్ధరణ డిజైన్లను సిద్ధం చేస్తున్నారని చెప్పారు. ప్రాథమిక అంచనాల ప్రకారం డయాఫ్రం వాల్ నిర్మాణం పునరుద్ధరణలో భాగం కావచ్చని భావిస్తున్నప్పటికీ, అన్ని సాంకేతిక నివేదికలను పరిశీలించిన అనంతరమే తుది మరమ్మతుల విధానాన్ని నిర్ణయిస్తామని మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సాంకేతిక పర్యవేక్షణ కమిటీ, జాతీయ ఆనకట్టల భద్రతా ప్రాధికార సంస్థ , కేంద్ర జల సంఘం సూచనలకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరణ కార్యక్రమాన్ని అమలు చేస్తుందని తెలిపారు. పునరుద్ధరణ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు భారత సైన్యంలో సేవలందించిన అనుభవజ్ఞులైన ఇంజినీర్ల సేవలను ప్రభుత్వం వినియోగిస్తోందని, కల్నల్ పరిక్షిత్ మెహ్రా నేతృత్వంలోని సమన్వయ కమిటీ పరీక్షలు, సాంకేతిక ప్రణాళికలను పర్యవేక్షిస్తూ పారదర్శకత, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని వెల్లడించారు. భద్రతే ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమని పునరుద్ఘాటించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, శాస్త్రీయ పరీక్షలు, నిపుణుల రూపకల్పన, చట్టబద్ధ భద్రతా అనుమతులు పూర్తయిన తర్వాతే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ప్రజాధనంతో నిర్మించిన ఈ కీలక ప్రాజెక్టును శాశ్వత భద్రతతో పునరుద్ధరించి రాష్ట్ర అవసరాలకు పూర్తి స్థాయిలో ఉపయోగపడేలా చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు.

# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వరాదని షరతును విధిస్తామని అన్నారు. కుటుంబంలో ఒకరికి ఇళ్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.క్యూర్ పరిధిలో ఇల్లు, స్థలం లేనివారికి తొలివిడతలో ప్రాధాన్యం కల్పిస్తామని మంత్రి చెప్పుకొచ్చారు. లబ్దిదారుల పేరిట స్థలం రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. స్థలంతో పాటు రూ.5లక్షల సబ్సిడీ అందజేస్తామని పేర్కొన్నారు. సోమవారం ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన వాట్సాప్ దరఖాస్తులు, ఇళ్ల బ్రోచర్‌లను ప్రారంభించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడారు. వారికి స్థలం ఇవ్వడంతో పాటు రూ.5లక్షల సహాయం అందజేస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. పదేళ్ల వరకు ఇళ్లు అమ్ముకునే అవకాశం లేదని చెప్పుకొచ్చారు. మొదటి దశలో 16నియోజకవర్గాల్లో ఇస్తున్నామని.. త్వరలోనే మిగిలిన నియోజకవర్గాల్లో కూడా ఇళ్లు ఇస్తామని స్పష్టం చేశారు. ఆయా పార్టీలు, రాజకీయాలకు సంబంధం లేకుండా ఇళ్లను కేటాయిస్తామనిపేర్కొన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల ఇందిరమ్మ ఇళ్లు పూర్తి అవుతున్నాయని ఇప్పటికే రెండు విడతల్లో ఏడు లక్షల ఇళ్లు మంజూరు చేశామని పేర్కొన్నారు.సొంత స్థలాలు ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లు అందజేశామని వెల్లడించారు. ఇంటి స్థలంలేని పేదలకు కూడా వీటిని అంద జేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి వివరించారు. లాభం, స్వార్థం లేకుండా పేదలకు ఇళ్లు నిర్మించి అందజేస్తు న్నామని పేర్కొన్నారు. అజఖీఇ పరిధిలో ఇళ్లు కట్టించే పథకాన్ని ఈ రోజు ప్రారంభించామని తెలిపారు. ఇందుకోసం పదహారు నియోజకవర్గాల్లో స్థలాలు ఎంపిక చేశామని చెప్పుకొచ్చారు. 528 అడుగుల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్లాట్లను నిర్మిస్తున్నామని వెల్లడించారు. కేసీఆర్ హయాంలో తప్పిదాలతో అప్పుడు కట్టిన ప్లాట్లు ఉపయోగపడకుండా పోయాయని చెప్పారు. నగరానికి దూరంగా 35 కిలోమీటర్ల దూరంలో కట్టడంతో పేదలు అక్కడకు వెళ్లలేదని తెలిపారు.చదరపు గజానికి లక్షల విలువ ఉండే కోర్ ప్రాంతంలో టవర్లు నిర్మించి పేదలకు ఇస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

# బాన్సువాడలో మళ్లీ గులాబీ జెండా ఎగరాలి

(మొదటి పేజీ తరువాయి)

కేటీఆర్ సమక్షంలో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన మోరీల్ శ్రీనివాస్ రావు, పలువురు నాయకులు తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ. గతంలో బాన్సువాడలో గులాబీ జెండాను ఎగురవేశాం. పెద్దాయన పోచారంను గెలిపిస్తే పోయి పోయి మునిగిపోయే పడవ కాంగ్రెస్ పార్టీలో చేరిండని ఎద్దేవా చేశారు. ఆయన కాంగ్రెస్‌లో చేరి కుడిదిలో పడ్డ ఎలుకలా గిలగిలా కొట్టుకుంటున్నడు. ఈ సమావేశంలో కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బాన్సువాడలో మరోసారి గులాబీ జెండా ఎగరేసే సమయం వచ్చిందని ఆయన అన్నారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి బీఆర్ఎస్ తరఫున గెలిచి పార్టీ మారారని, ప్రస్తుతం కాంగ్రెస్ పరిస్థితి కూడా బాగోలేదని ఆయనకు అర్థమైందన్నారు. ఈ గొంతులో ప్రాణం ఉన్నంత వరకు పార్టీ మారనని చెప్పిన పోచారం చివరకు మాట తప్పి పార్టీ మారారని ఆరోపించారు. స్పీకర్‌గా పనిచేసిన వ్యక్తి ఇప్పుడు తాను ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకునే పరిస్థితి కూడా లేదని ఎద్దేవా చేశారు. పోచారం తన రాజకీయ భవిష్యత్తును తానే సమాధి చేసుకున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డిపై కూడా కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయకుండా చేతులెత్తేశారని ఆరోపించారు. దేవుళ్లపై ఒట్టు పెట్టి కూడా అబద్దాలు చెబుతున్నారని విమర్శించారు. ఏ సభ పెట్టినా కేసీఆర్‌ను విమర్శించడమే సీఎం పనిగా మారిందన్నారు. రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేటీఆర్ అన్నారు. యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని, షాపుల్లో ఎరువుల సంచులు లేకపోతే యాప్‌లో కనిపించినా ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. ఢిల్లీకి పంపేందుకు సంచులు ఉంటున్నాయని, కానీ రైతులకు మాత్రం అందడం లేదని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కూడా కేటీఆర్ స్పందించారు. రెండు పిల్లర్లు కుంగి 31 నెలలు అవుతున్నా ఇప్పటి వరకు మరమ్మతులు ఎందుకు చేపట్టలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కన్నెపల్లి నుంచి ప్రతిరోజూ నీరు కిందకు వెళ్తున్నా పంపింగ్ చేయడం లేదన్నారు. రిజర్వాయర్లు డెడ్ స్టోరేజ్‌కు వెళ్తే ప్రభుత్వం మాత్రం 'కోల్డ్ స్టోరేజ్'లోకి వెళ్లిపోయిందని ఎద్దేవా చేశారు. తెలంగాణ కోసం అవసరమైతే రక్తమే కాదు ప్రాణాలు కూడా ఇస్తామని బీఆర్ఎస్ ఎప్పుడూ చెప్పిందని కేటీఆర్ అన్నారు.

# క్షేత్ర స్థాయి పర్యటనలకు పవన్ కళ్యాణ్ దూరం?

(మొదటి పేజీ తరువాయి)

పుష్కర ఘాట్ల సందర్శనకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కార్యాలయ సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అయితే క్షేత్ర స్థాయి పర్యటనల సందర్భంగా జనసమూహం మధ్యకు వెళ్లిన సందర్భంలో శస్త్ర చికిత్స చేసిన భుజానికి ఏ మాత్రం అసౌకర్యం కలిగినా గాయం తిరగబెడుతుందని, అలాంటి పరిస్థితి ఏర్పడితే మరోమారు సరిచేయడం కూడా క్లిష్టతరమవుతుందని వైద్యులు స్పష్టం చేశారు. ఎడమ భుజానికి కూడా ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. కనీసం మరో రెండు వారాల పాటు క్షేత్ర స్థాయి పర్యటనలకు దూరంగా ఉండాలని వైద్యులు ఉప ముఖ్యమంత్రివర్యులకు సూచించారు. వైద్యుల సలహా మేరకు క్షేత్ర స్థాయి పర్యటనల షెడ్యూలు మార్చాలని కార్యాలయ అధికారులకు సూచనలు చేశారు.అదే సమయంలో అధికారిక కార్యక్రమాలకు ఇబ్బంది కలగకుండా మంగళగిరిలోని క్యాంపు కార్యాలయం నుంచి విధులు నిర్వహించేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు.

# జెపి నడ్డాతో కాక్రోచ్ జనతా ప్రతినిధుల భేటీ

(మొదటి పేజీ తరువాయి)

పది నిమిషాల పాటు నడ్డాతో భేటీ అయ్యారు. వారి డిమాండ్లను పరిశీలించి, ప్రభుత్వంలోని సంబంధిత స్థాయిలో చర్చిస్తానని నడ్డా హామీ ఇచ్చారని సౌరవ్ దాస్ తెలిపారు. అయితే.. ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన హామీలు లభించలేదని, డిమాండ్లు నెరవేరే వరకు శాంతియుత నిరసనలు కొనసాగిస్తామని వెల్లడించారు. జేపీ నడ్డాకు సమర్పించిన లేఖలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై తీవ్ర విమర్శలు చేసింది సీజేపీ. నీట్ యూజీ-2026 ప్రశ్నపత్రం లీకేజీ సహా ఇతర పరీక్షల నిర్వహణలో తలెత్తిన లోపాలకు మంత్రి బాధ్యత వహించాలని పేర్కొంది. సీబీఎస్ఈ 12వ తరగతి పోర్టల్ సమస్యలు, సీయూఈటీ పరీక్షల్లో జాప్యం వంటి పరిణామాలు వంటివి కూడా వైఫల్యాలేనని ఆరోపించింది. పరీక్షల వ్యవస్థలో అవసరమైన సంస్కరణలు చేపట్టడంలో ధర్మేంద్ర ప్రధాన్ విఫలమయ్యారని సీజేపీ పేర్కొంది. ఇకపోతే ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరాహార దీక్షను విరమించారు. సోమవారం కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధులు సమావేశమయ్యారు. అనంతరం సోనమ్.. తన దీక్షను విరమించారు. దీంతో గత 23 రోజులుగా ఆయన చేస్తున్న దీక్ష ముగిసినట్లు అయింది. నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్, విద్యావ్యవస్థలోని లోపాలు నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష చేపట్టారు. జూన్ 28వ తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆయన ఈ దీక్ష ప్రారంభించారు. అయితే ఢిల్లీ హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో జంతర్ మంతర్ వద్ద ఆయన చేస్తున్న దీక్షను పోలీసులు భగ్నం చేశారు. అనంతరం ఆయన్ని సఫ్దర్ జంగ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా ఆయన తన దీక్షను కొనసాగించారు. సోనమ్ ఆరోగ్యం నిలకడగా ఉందని ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆసుపత్రి వైద్యులు ఆదివారం హెల్త్ బులెటిన్ విడుదల చేశారు.

# నేడు,రేపు కొడంగల్‌లో సిఎం పర్యటన

**హైదరాబాద్,జులై 20 :** నేటి నుంచి రెండు రోజులపాటు కొడంగల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు. ఎడ్యుకేషన్ హబ్ పనుల పరిశీలించి, నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమీక్షించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు దుద్యాల్ మండలం, హకీంపేట గ్రామంలోని ఎడ్యుకేషన్ హబ్ ను పరిశీలించనున్నారు. సాయంత్రం 5 గంటలకు కొడంగల్ నియోజకవర్గంలోని అన్ని అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించనున్నారు. రాత్రికి కొడంగల్ లోనే బస చేయనున్న ముఖ్యమంత్రి, బుధవారం 10 గంటలకు స్థానిక నాయకులు, సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నట్లు ప్రకటించారు.

# పోలీస్ సిబ్బంది సంక్షేమమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

మెరుగుపరచడం, వారి కుటుంబాలకు ఆర్థిక, సామాజిక భరోసా కల్పించేందుకు శాఖ అనేక సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. పోలీసు పిల్లల్లో ప్రతిభను ప్రోత్సహించేందుకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు, మెరిటోరియస్ స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే జేఈఈ, నీట్‌తో పాటు జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ప్రత్యేక ఆర్థిక సహాయం, స్కాలర్‌షిప్‌లు అందిస్తూ ఉన్నత విద్యను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. సిబ్బందికి వివాహ రుణాలు, వైద్య రుణాలు, విద్యా రుణాలు, మెరిట్ స్కాలర్‌షిప్‌లు, మెరిటోరియస్ స్కాలర్‌షిప్‌లు, అదనపు కార్పస్ ఇన్సూరెన్స్, వివిధ గ్రాంట్లు వంటి సంక్షేమ పథకాల ద్వారా సమగ్ర ఆర్థిక భద్రత కల్పిస్తున్నట్లు డీజీపీ వివరించారు.

వెల్ఫేర్ సేవలను పూర్తిగా డిజిటలైజ్ చేసి పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించాలని, హోదాల వారీగా వెల్ఫేర్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. శాఖకు చెందిన కమర్షియల్ కాంప్లెక్స్‌ల అద్దె రేట్లను పారదర్శకంగా నిర్ణయించి, సిబ్బందికి, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా లీజుకు ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో డీజీ మహేష్ ఎం. భగవత్, ఏడీజీ సంజయ్ జైన్, షహనవాజ్ ఖాసిం, గజరావు భూపాల్, ఉదయ్ కుమార్ రెడ్డి, శరత్ కుమార్, గోపీ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాసుపత్రుల్లో రక్షణ లేకుండా పోయింది

(మొదటి పేజీ తరువాయి)

బాధపడుతున్నారని చెప్పారు. బాలింతల నుంచి పసిగుడ్డులకు ఇన్‌ఫెక్షన్ సోకిందని తెలిపారు. బాలింతల నుంచి పాలు తాగడం వల్ల నీలోఫర్‌లో పసిగుడ్డులు చికిత్స పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాలింతలు పూర్తిగా కోలుకోకుండా పసిగుడ్డులను ఎవరు చూసుకుంటారని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఆరుగురికి 10వ తేదీన ఇన్‌ఫెక్షన్ వచ్చిందని, నలుగురికి 11వ తేదీన సిజేరియన్ చేశారని హరీశ్‌రావు తెలిపారు. థియేటర్ మెయింటెనెన్స్ సరిగ్గా లేక ఇన్‌ఫెక్షన్ సోకిందని బాధితులు అంటున్నారని అన్నారు. వైద్యుల నిర్లక్ష్యం కూడా కారణమని అంటున్నారని అన్నారు. కాలం చెల్లిన మందులు వాడినందుకే ఈ పరిస్థితి వచ్చింటున్నారని తెలిపారు. ఇంత జరిగినా ప్రభుత్వం ఎందుకు విచారణ జరపడం లేదని ప్రశ్నించారు.

# యువతపై లాఠీచార్జ్.. స్పందించిన రాహుల్ గాంధీ

**హైదరాబాద్:జులై 20** కాక్రోచ్ పార్టీ సోమవారం చేపట్టిన చలో పార్లమెంట్ యాత్రపై ఢిల్లీ పోలీసులు లాఠీచార్జ్ చేసిన విషయం తెలిసిందే. శాంతియుతంగా జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ వైపు సాగుతున్న యువతను పోలీస్ బలగాలు అడ్డగించాయి. ఎలాంటి హెచ్చరికలు లేకుండానే వారిపై పోలీసులు లాఠీచార్జ్ చేశారు.

ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరును ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఖండించారు. ప్రజాస్వామ్య దేశంలో ఈ తరహా చర్య సరైంది కాదని మండిపడ్డారు.

"యువత చేస్తున్న పనిలో ఏమాత్రం తప్పు లేదని, కానీ ప్రభుత్వం, పోలీసులు వ్యవహరిస్తున్న తీరు మాత్రం అత్యంత అసహ్యకరమైనది.

విద్యార్థులపై బాష్పవాయువు ప్రయోగించడం, లాఠీఛార్జ్ చేయడం వంటివి ఏమాత్రం సరైన ప్రవర్తన కాదు, ఇది ప్రజాస్వామ్యయుత భారతీయ విధానం కాదు , ఇలా వ్యవహరించడం హేయమైన చర్య," అని రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా ఒక వీడియో సందేశంలో పేర్కొన్నారు.

## పిల్లలను ప్రైవేట్ పాఠశాలలో నుంచి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన బొడాసు అంజి



పెద్దపల్లి, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): బొంపల్లి గ్రామ సర్పంచ్ దాడి మౌనిక--సంతోష్ మరియు గ్రామ పాలకవర్గం సూచన మేరకు బీజేపీ మండల నాయకుడు బొడాసు అంజి తన ఇద్దరు పిల్లలను ప్రైవేట్ స్కూల్ నుండి బొంపల్లి గ్రామంలోని మేరపల్లి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. అంజి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందిస్తున్నారని, మంచి బోధన జరుగుతోందని పేర్కొన్నారు. బొంపల్లి, మేరపల్లి ప్రాంతాల నుండి ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులను కూడా మేరపల్లి ప్రైమరీ స్కూల్, జడ్‌పిహెచ్ఎస్ బొంపల్లి పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొంపల్లి గ్రామ ఉప సర్పంచ్ పంబల రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు,
ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అన్నదాతల కష్టాలు పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం



పెద్దపల్లి, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): జిల్లాలో సాగునీరు, విద్యుత్ అందక రైతులు తీవ్ర నిరాశలో ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై బీజేపీ నాయకులు మండిపడ్డారు. డి-83, డి-86 కాలువల ద్వారా సాగునీరు అందించడంలో, వ్యవసాయానికి సరిపడా విద్యుత్ సరఫరా చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వారు ఆరోపించారు.జిల్లా మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణరావు రైతుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా కల్పించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.రైతుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం బీజేపీ ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతుందని, అన్నదాతలకు అండగా నిలుస్తుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం, జిల్లా వైస్ ప్రెసిడెంట్ శనిగరం రమేష్, నాయకులు కంకణాల జ్యోతి బాసు, భూషణ్, వేణి శ్రీనివాస్ గౌడ్, తూడి రవీందర్, మనోహర్, కొమ్మరిశెట్టి రమేష్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన బాల్యం మన గ్రామం లక్ష్యం




రామడుగు, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా రామడుగు మండలం కొరటపల్లి గ్రామంలో చిన్నారులకు నత్తల మందు పంపిణీ చేశారు. గ్రామంలోని అర్హులైన పిల్లలకు ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది సమక్షంలో మందు అందజేశారు.పిల్లల్లో నులిపురుగుల సమస్యను నివారించడం, పోషకాహారం శరీరానికి సక్రమంగా అందేలా చేయడం, శారీరక--మానసిక ఎదుగుదలను మెరుగుపరచడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. తల్లిదండ్రులు పరిశుభ్రత పాటిస్తూ పిల్లలకు తప్పనిసరిగా నత్తల మందు వేయాలని సూచించారు. ఆరోగ్యవంతమైన బాల్యమే అభివృద్ధి చెందిన సమాజానికి పునాది అని నిర్వాహకులు పేర్కొంటూ ప్రతి చిన్నారి ఆరోగ్యంగా ఎదగాలనే లక్ష్యంతో
ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## శ్రీ వైద్యనాథ్ ఆలయ నిర్మాణానికి భారీ విరాళం




గన్నేరువరం, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): గన్నేరువరం మండలం మైలారం గ్రామంలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో ద్వాదశ జ్యోతిర్లింగాల నిర్మాణం కొనసాగుతోంది. ఇందులో భాగంగా శ్రీ వైద్యనాథ్ ఆలయ నిర్మాణానికి ముత్యాల లక్ష్మి--కి.శే. వీరారెడ్డి కుటుంబ సభ్యులు రూ.1,00,116 విరాళం అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ వరాల పరిసరాములకు విరాళాన్ని అందజేసిన దాతలను అర్చకులు అభినందించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ముత్యాల జగన్ రెడ్డి, గుండా రాజేశ్వర్ రెడ్డి, సింగిరెడ్డి ప్రకాష్ రెడ్డి, కనివేని బాలయ్య, బుర్ర శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని యుఎస్ఎఫ్ఐ డిమాండ్




అమ్రాబాద్, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): అచ్చంపేట పట్టణంలో భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యుఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎండి సయ్యద్ మాట్లాడుతూ, స్కాలర్‌షిప్‌లు విడుదల కాకపోవడం వల్ల పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సుమారు రూ.8 వేల కోట్ల స్కాలర్‌షిప్‌లు బకాయిలుగా ఉన్నప్పటికీ ఇప్పటివరకు విద్యార్థుల ఖాతాల్లో జమ కాలేదని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ నాయకులు సంతోష్, నజీర్, గణేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తచెరువులో అక్రమ కట్టడాలు తొలగించాలని డిమాండ్



హుస్నాబాద్, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కొత్తచెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో ఉన్న అక్రమ కట్టడాలను వెంటనే కూల్చివేయాలని భారతీయ కిసాన్ సాంగ్ డివిజన్ ఇన్‌చార్జ్ కవ్వ వేణుగోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఇరిగేషన్ అధికారులు 2025 డిసెంబర్ 2న కలెక్టర్కు సమర్పించిన సర్వే రిపోర్ట్ ప్రకారం ఇప్పటికీ రెవెన్యూ, మున్సిపల్ అధికారులు చర్యలు తీసు కోలేదని ఆయన విమర్శించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కోట్ల రూపాయలతో కొత్తచెరువును మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేస్తూ ఆరేపల్లి రోడ్డు బైపాస్ పనులు చేపడుతున్నందున, ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు సమన్వయంతో ఎఫ్‌టిఎల్ పరిధిని గుర్తించి అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలని ఆయన ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు.

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



సిద్దిపేట, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): సిద్దిపేట రూరల్ మండలం బుస్సాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వహణను జిల్లా కలెక్టర్ కె. హైమావతి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వెజిటేబుల్ బిర్యానీ, గుడ్డు, టమాట--కందిపప్పు సాంబారు నాణ్యతను పరిశీలించిన కలెక్టర్, భోజనం నాణ్యతను మెరుగుపరచాలని సూచించారు. ఇష్టానుసారంగా వంటలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిల్వ ఉండటాన్ని గమనించి, దోమలు వ్యాప్తి చెందకుండా వెంటనే నీటిని తొలగించాలని ప్రిన్సిపల్‌కు ఆదేశించారు.మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అన్నం, సాంబారు, గుడ్డు పరిశీలించగా, మెనూ ప్రకారం వెజిటేబుల్ బిర్యానీ తయారు చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన కామన్ డైట్ మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని, నిర్లక్ష్యం పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించిన కలెక్టర్, రోజువారీ మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించారు. గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై ఆరా తీసి, ఫారాల డిజిటైజేషన్‌ను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో పారదర్శకత కోరిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్



కరీంనగర్, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో రాజకీయాలకు తావు లేకుండా, అర్హులైన పేదలకు మాత్రమే ఇండ్లు కేటాయించాలని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ జిల్లా కలెక్టర్ చిత్రమిశ్రాకు వినతి పత్రం అందజేశారు.కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్‌ను కలిసిన ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణ పథకం నిరుపేదల సొంతింటి కలను నిజం చేసే కీలక కార్యక్రమమని, దీనిని బాధ్యతాయుతంగా అమలు చేయాలని సూచించారు. కేటాయింపులో ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లు లేకుండా, పూర్తిగా నిబంధనల ప్రకారం అర్హులైన వారికే ఇండ్లు ఇవ్వాలని కోరారు.ఆరెపల్లి గ్రామంలో రోడ్డు నిర్మాణం కారణంగా ఇండ్లు కోల్పోయిన వారికి అప్పటి కలెక్టర్ ఇచ్చిన హామీ మేరకు తప్పనిసరిగా ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి నిజమైన లబ్ధిదారులను గుర్తించాలని, ఎంపిక చేసిన జాబితాను పారదర్శకంగా ప్రకటించడం ద్వారా ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ నియోజకవర్గానికి చెందిన పలువురు బిఆర్ఎస్ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బస్తీ దవాఖానకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే విజయ రమణారావు



సుల్తానాబాద్, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): సుభాష్‌నగర్‌లో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న బస్తీ దవాఖాన భవనానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు సోమవారం శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను నివాస ప్రాంతాలకే చేరువ చేయాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా బస్తీ దవాఖానలు కీలకమని తెలిపారు. ఈ దవాఖాన ద్వారా సుభాష్‌నగర్‌తో పాటు సమీప కాలనీల ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు, గర్భిణీలు, బాలింతలు, వృద్ధులు, చిన్నారులకు అవసరమైన పరీక్షలు, మందులు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తరువాత యాదవ్‌నగర్‌లో వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షిస్తూ భూలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య జలాభిషేకం చేసి రాష్ట్రంలో పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు సుఖశాంతులతో జీవించాలని ప్రార్థించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వ్యవసాయ రంగ అభివృద్ధికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాష్ రావు, మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, వైస్ చైర్మన్ అంతటి పుష్పలత, కౌన్సిలర్లు ఊట్ల వరప్రదీప్, బాకం సాయి కిరణ్, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, మహిళలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# యువతకు ఉద్యోగాలు కల్పించడంలో కేంద్రం విఫలమైందని ఏఐవైఎఫ్ విమర్శలు




కరీంనగర్, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): బీజేపీ ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రాహ్మణపల్లి యుగంధర్ విమర్శించారు.జిల్లా అధ్యక్షుడు పోలోజు రంజిత్ అధ్యక్షతన బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జరిగిన ఏఐవైఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత 12 సంవత్సరాలుగా కోటి ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన కేంద్రం ఒక్క కోటి ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరుస్తూ, అవుట్‌సోర్సింగ్ విధానాలను ప్రోత్సహించడం వల్ల శాశ్వత ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయని అన్నారు.విద్యా, వైద్య రంగాల వాణిజ్యకరణ యువత భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చుతోందని యుగంధర్ పేర్కొన్నారు. గ్రామ గ్రామాన ఏఐవైఎఫ్ యువజన సంఘాలను నిర్మించి, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.రాష్ట్రంలో బిఆర్ఎస్ పాలనలో కూడా యువజన సంక్షేమానికి ప్రత్యేక విధానం లేకపోవడం వల్ల నిరుద్యోగం పెరిగిందని ఆయన విమర్శించారు. ఢిల్లీలో నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, యువతపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని ఏఐవైఎఫ్ తీవ్రంగా ఖండించింది.ఈ సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కసిభోసుల సంతోష్ చారి, ఉపాధ్యక్షులు కాల్వ శ్రీనివాస్ యాదవ్, కోశాధికారి పినమల్ల ఉదయ భాస్కర్
తదితరులు పాల్గొన్నారు.

# దుబాయ్‌లో ఈటిసిఏ ఆధ్వర్యంలో ఘనంగా బోనాల మహోత్సవం





కరీంనగర్, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): యూఏఈలోని రాస్ అల్ ఖైమా మైత్రి ఫార్మ్స్‌లో ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఈటిసిఏ) ఆధ్వర్యంలో శ్రీ మహంకాళి అమ్మవారి బోనాల మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు.వివిధ ఎమిరేట్స్‌ల నుంచి సుమారు 400 మంది తెలంగాణ ప్రవాసులు కుటుంబ సమేతంగా హాజరై భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. గౌరమ్మ పూజ, బోనాల సమర్పణ, కుంకుమార్చన, మహాహారతి, దీపోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళలు పట్టు చీరలు ధరించి తలపై బోనాలు మోసుకుంటూ ఊరేగింపు నిర్వహించగా, ఒగ్గు డోలు మోతలు, పోతురాజుల విన్యాసాలు తెలంగాణ సంస్కృతిని విదేశీ నేలపై ఆవిష్కరించాయి.ముఖ్య అతిథిగా హాజరైన మైత్రి గ్రూప్ వ్యవస్థాపకులు కొత్త జైపాల్ రెడ్డి, విదేశాల్లో తెలంగాణ సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేస్తున్న ఈటిసిఏ సభ్యులను అభినందించారు. సంస్థ అధ్యక్షుడు జగదీష్ రావు, వ్యవస్థాపక అధ్యక్షుడు కిరణ్ కుమార్ పీచర మాట్లాడుతూ, తెలంగాణ పండుగల గొప్పతనాన్ని విదేశాల్లో జన్మించిన పిల్లలకు పరిచయం చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. అనంతరం భక్తులందరికీ మహాప్రసాదం పంపిణీ చేసి, సంప్రదాయ వంటకాలతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వగ్రామంలో బోనాలు జరుపుకున్న అనుభూతి కలిగిందని ప్రవాసులు నిర్వాహకులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఈటిసిఏ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, మహిళా విభాగం, వాలంటీర్లు, యూఏఈ నలుమూలల నుంచి వచ్చిన తెలంగాణ ప్రవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ రక్షణ సేన జెండా పండుగ



హుజురాబాద్, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): హుజురాబాద్ నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ సీనియర్ నాయకులు పొన్నం శిరీష, రమేష్ ఆధ్వర్యంలో జెండా పండుగ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ పార్టీ జెండాను ఎగరవేశారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన కవిత నాయకత్వంలో ప్రజల ముందుకు వచ్చిందని, ఉచిత విద్య, ఉచిత వైద్యం, రైతాంగ సంక్షేమం, నిరుద్యోగులకు అవకాశాలు కల్పించడమే లక్ష్యమని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న ఏకైక నాయకురాలు కవిత అని, రాబోయే రోజుల్లో తెలంగాణ రక్షణ సేన ప్రజలకు రక్షణ కవచంగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ విభాగం అధ్యక్షురాలు అంకం శివరాణి, ఆదివాసి విభాగం జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, సీనియర్ నాయకులు బుడిగె పరుశురాం గౌడ్, రంగరవేణి లక్ష్మణ్, ఏనుగు మల్లారెడ్డి, సురేష్, రాజ్ కుమార్, బండ అశోక్, జంపాల రితేష్, అంబాల హరీష్, కొతురి నరేష్, గుండారపు కిరణ్, నూతి సాయి చరణ్, ఎండి సల్మా, అతాహర్, కొలిపాక గౌతమి, కుతాడి రజిత, జంగా అపర్ణ, దాసరి అంజలి తదితరులు పాల్గొన్నారు. దాదాపు వంద మంది కార్యకర్తలు, మహిళలు, యువకులు హాజరై జెండా పండుగను విజయవంతం చేశారు.

## మహిళా సంఘాలతో డిజిటల్ లావాదేవీలపై సమీక్ష సమావేశం



తిమ్మాపూర్, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): రేణికుంట గ్రామంలో సర్పంచ్ ఎలుక ఆంజనేయులు మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో నగదు రహిత లావా దేవీలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ లావాదేవీల వల్ల డబ్బు భద్రంగా ఉండటంతో పాటు సమయం ఆదా అవుతుందని, ఎవరూ ఇతరుల పేరుతో రుణాలు తీసుకునే అవకాశం ఉండదని తెలిపారు. యూపీఐ, ఫోన్‌పే, గూగుల్ పే, భీమ్ వంటి చెల్లింపు విధానాలను సురక్షితంగా వినియోగించాలని, ఎటిఎం పిన్, ఓటీపీ, బ్యాంకు వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల నిధులు నేరుగా ఖాతాల్లో జమ అవుతున్నందున ప్రతి మహిళ డిజిటల్ సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు. మహిళా సంఘాలు పొదుపును పెంచుకుని స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే కుటుంబాలతో పాటు గ్రామాభివృద్ధికి తోడ్పాటుగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బోయిని శంకరయ్య, ముక్కిస లింగారెడ్డి, పండుగ సంపత్, మండల సిఆర్పి సరళ, సి.ఏ చెక్కబండి శ్రీలత, మహిళా సంఘ సభ్యులు, గ్రామస్థులు, అధికారులు పాల్గొన్నారు.

## రైతులకు వాతావరణ అనుకూల వ్యవసాయంపై అవగాహన సదస్సు



హుస్నాబాద్, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): హుస్నాబాద్ మండలం మాలపల్లి గ్రామంలో వరాహ క్లైమేట్ ఎగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతులకు వాతావరణ అనుకూల వ్యవసాయం, కార్బన్ క్రెడిట్ అవకాశాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెన్న రాజు మాట్లాడుతూ వాతావరణ మార్పుల ప్రభావంతో రైతులు ఆధునిక, పర్యావరణహిత సాగు విధానాలను అవలంబించడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవడంతో పాటు నీటి వినియోగాన్ని తగ్గించి ఖర్చులను నియంత్రించవచ్చని తెలిపారు. వరాహ సంస్థ ప్రతినిధులు పంట అవశేషాల నిర్వహణ, సేంద్రియ పదార్థాల వినియోగం, నీటి సంరక్షణ, చెట్ల పెంపకం వంటి పద్ధతులను పాటించడం ద్వారా నేల సారం మెరుగుపడుతుందని వివరించారు. అలాగే కార్బన్ క్రెడిట్‌కు సంబంధించిన అర్హత ప్రమాణాలు, నమోదు విధానం, భవిష్యత్తు అవకాశాలపై రైతులకు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇన్‌చార్జి పల్లె వెంకటేష్ గౌడ్, ఢిల్లీ మేనేజర్ దేవాన్ష్, ఫీల్డ్ కోఆర్డినేటర్ చిట్యాల ఇసాక్, సర్పంచ్ వెన్న స్వ్నలత, వార్డు సభ్యులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## పిహెచ్‌సీని పరిశీలించిన డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు



కరీంనగర్, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు సోమవారం కట్టరాంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆసుపత్రిలోని పరిస్థితులు, రోగులకు అందుతున్న వైద్య సేవలను ఆయన పరిశీలించారు. రోగులతో స్వయంగా మాట్లాడి అందుతున్న చికిత్స, సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు, కుక్క--కోతి కాట్ల కేసులపై వైద్యులను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పేద, మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వ వైద్యంపై నమ్మకంతో వస్తారని, ఆ విశ్వాసాన్ని నిలబెట్టేలా సమయపాలన పాటిస్తూ మెరుగైన సేవలు అందించాలని వైద్య సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఆసుపత్రి నిర్వహణలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం పెంచేలా నాణ్యమైన సేవలు కొనసాగించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సాయిరాజ్, వైద్య సిబ్బంది సాగర్, పావని, శ్వేత, సుమతి, చల్మెడ హాస్పిటల్ ట్రైనీ డాక్టర్లు పాల్గొన్నారు.

## దుర్గాభవానీ అమ్మవారికి కాకర కాయల మాలల అలంకరణ



కరీంనగర్ రూరల్, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఆషాడమాసం శాకంబరీ ఉత్సవాల భాగంగా కరీంనగర్ నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో అమ్మవారిని కాకర కాయల మాలలతో అలంకరించారు. ఆలయ ప్రధానార్చకులు పవనకృష్ణ శర్మ విశేష హారతులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మన్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం



సుల్తానాబాద్, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): సుల్తానాబాద్ పట్టణంలోని 6వ వార్డు సుభాష్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ బాకం సాయి కిరణ్ మాట్లాడుతూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, వార్డు ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కార్యాలయం కేంద్రంగా పనిచేస్తుందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, వార్డు అభివృద్ధికి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు ప్రజలతో మమేకమై వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవేందర్, శంకర్, కిరణ్, శ్రీకాంత్, దుర్గయ్య, రత్నం, వార్డు సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల నిధులు ప్రైవేట్ ఇన్సూరెన్స్‌కు ఇవ్వొద్దని సీఐటీయూ డిమాండ్




కరీంనగర్, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు బదిలీ చేయకుండా, కార్మికులకు నేరుగా సంక్షేమ పథకాలు అందించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేష్ మాట్లాడుతూ, ప్రభుత్వం జీఓ నెం.12 ద్వారా రూ.346 కోట్లను ప్రైవేట్ బీమా కంపెనీలకు అప్పగించడం దుర్మార్గమని, కార్మికులకు నష్టపరిహారం అందకపోవడం వల్ల వేలాది మంది ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. 1996 కేంద్ర చట్టం ప్రకారం బోర్డు అడ్వైజరీ కమిటీ నిర్ణయం మేరకు మాత్రమే నిధులు ఖర్చు చేయాలని, కానీ ప్రభుత్వం నిబంధనలు ఉల్లంఘించి ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించడం పేద కార్మికులపై అన్యాయం చేస్తున్నదని అన్నారు. రెన్యువల్ కాని 13 లక్షల కార్మికుల కార్డులను వెంటనే పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న రూ.54,000 నష్టపరిహారాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కదిరే రమేష్, ఉపాధ్యక్షులు పళ్ళ తిరుపతి, కోశాధికారి వట్టి జగదీష్, సైదాపూర్ అధ్యక్షుడు రాధారపు సంపత్, కరీంనగర్ అర్బన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, జమ్మికుంట నాయకులు రాజయ్య, శంకరపట్నం అధ్యక్షుడు ఇమ్మడి చక్రపాణి, ఇల్లందకుంట అధ్యక్షుడు రేణికుంట సరయ్య, వీణవంక అధ్యక్షుడు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని ఉద్యమంలా అమలు చేయాలి



– కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని ఉద్యమంలా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణి సమావేశ మందిరంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ జలసిరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. గ్రామాల్లో ఇంకుడుగుంతలు, ఊటకుంటలు, పంటకుంటలు, బోరు బావుల రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. నీటి కొరతను ఎదుర్కొనేందుకు ప్రతి వర్షపు చుక్కను భూమిలోకి ఇంకించి భూగర్భ జలాలను పరిరక్షించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణ, సహజ వనరుల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన గ్రామాభివృద్ధి లక్ష్యంగా వీబీజీ రామ్–జీ పథకాన్ని అన్ని శాఖల సమన్వయంతో అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ అనిల్ కుమార్, అదనపు కలెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, అశ్విని తానాజీ వాకడే, డీపీఓ జగదీశ్వర్, డీఆర్డీఓ గీతతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలలో అతిథి అధ్యాపకుల దరఖాస్తులకు ఆహ్వానం

గంగాధర, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని ప్రభుత్వ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె. రామకృష్ణ తెలిపారు. ఇంగ్లీష్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్, కామర్స్, మాతేమటిక్స్, హిస్టరీ విభాగాల్లో ఒక్కో ఖాళీ ఉందని పేర్కొన్నారు. పోస్టు గ్రాడ్యుయేషన్‌లో ఓసీ, బీసీ అభ్యర్థులకు కనీసం 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉండాలని, నెట్, సెట్, పీహెచ్‌డీ, బోధన అనుభవం ఉన్న వారికి వెయిటేజీ ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు జూలై 21 సాయంత్రం 4 గంటలలోపు తమ బయోడేటాతో దరఖాస్తులను ఎస్సారార్ కళాశాల ఆఫీస్‌లో సమర్పించాలి. ఇంటర్వ్యూలు జూలై 22 ఉదయం 10 గంటలకు ఎస్సారార్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ (అటానమస్)లో నిర్వహించబడతాయి. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

## సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన మేయర్ కొలగాని శ్రీనివాస్



కరీంనగర్, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కరీంనగర్ నగరపాలక సంస్థ 20వ డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్ సహకారంతో రూ.70 లక్షల యూఐడీఎఫ్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో మౌలిక వసతుల అభివృద్ధికి పాలకవర్గం అంకితభావంతో పనిచేస్తోందని, నగర సమగ్ర అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, స్థానిక కార్పొరేటర్ పర్వతం మల్లేశం, 19వ డివిజన్ కార్పొరేటర్ సుధగోని మాధవి కృష్ణ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, ఇతర కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## మానసా దేవి ఒడి బియ్యం చీరలకు వేలంపాటలో రికార్డు ధర



గన్నేరువరం, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం కాసింపేట మానసా దేవి అపురూప లక్ష్మి ఆలయంలో అమ్మవారి ఒడి బియ్యం చీరల వేలంపాట అంగరంగ వైభవంగా జరిగింది. భక్తుల పోటాపోటీ మధ్య జరిగిన ఈ వేలంలో బత్తుల మల్లయ్య--రాజవ్వ దంపతులు రూ.17,80,000కు ఒడి బియ్యం చీరలు దక్కించు కున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ రికార్డు స్థాయిలో ఈ ధర రావడం ఇదే మొదటిసారి అని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు ఆ దంపతులను అభినందించారు.

## ఘనంగా గ్రామసభ కార్యక్రమం



అమ్రాబాద్, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): అమ్రాబాద్ గ్రామ పంచాయతీలో గ్రామసభ కార్యక్రమం ఘనంగా జరిగింది. సర్పంచ్ చిగుర్ల కోటయ్య, పంచాయతీ సెక్రటరీ శివ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో గ్రామ అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, త్రాగునీటి సమస్యలు, గ్రామీణ రోడ్లు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామస్తులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటిని పరిష్కరించేందుకు అధికారులు సానుకూలంగా స్పందించారు. గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని సర్పంచ్ కోటయ్య పిలుపునిచ్చారు. గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేశారు. పంచాయతీ తరపున పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

## శ్రీ ఉమామహేశ్వర దేవస్థానానికి రూ.11 లక్షల విరాళం



అమ్రాబాద్, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): శ్రీశైలం ఉత్తర ద్వారంలోని శ్రీ ఉమామహేశ్వర దేవస్థానం అభివృద్ధికి హైదరాబాద్ జిల్లెలగూడకు చెందిన జీఎంఆర్ బిల్డర్స్ అధినేత గంగుల మల్లారెడ్డి రూ.11 లక్షల విరాళం ప్రకటించారు. ఈ మొత్తంతో భక్తుల సౌకర్యార్థం రెండు గదుల నిర్మాణం చేపడతామని తెలిపారు. మల్లారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదనంగా నిత్యాన్నదాన కార్యక్రమానికి రూ.25 వేల విరాళం అందజేశారు. దేవస్థానం చైర్మన్ బీరం మాధవరెడ్డి మల్లారెడ్డి కుటుంబాన్ని శాలువా, పూలదండలతో ఘనంగా సన్మానించారు. ఆలయ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీరం రాజు రెడ్డి, బీరం మధుకర్ రెడ్డి, బాల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర ఓటర్ సవరణ విజయవంతం చేయాలి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి



కరీంనగర్, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో జరుగుతున్న సమగ్ర ఓటర్ సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి, అసెంబ్లీ ఇన్‌చార్జ్ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. డీసీసీ కార్యాలయంలో కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూలై 31 నాటికి 90 శాతం, ఆగస్టు 3లోపు 100 శాతం ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. లక్ష్యాన్ని సాధించిన కార్యకర్తలకు రాహుల్ గాంధీతో ఫోటో దిగే అవకాశం కల్పిస్తామని తెలిపారు. అంజన్ కుమార్ మాట్లాడుతూ బి ఎల్ ఓలతో సమన్వయం చేసుకుంటూ బి ఎల్ ఎ–2లు ప్రతి ఇంటిని సందర్శించి ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా చూడాలని, బూత్ స్థాయిలో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి ఓటర్లకు సహాయం అందించాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, సర్ సూపర్వైజర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కన్న కొడుకులే అనాథలను చేశారని కలెక్టర్కు ఫిర్యాదు



గన్నేరువరం, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కరీంనగర్ జిల్లా పెన్నేరువరం మండలం చాకలి వానపల్లి గ్రామానికి చెందిన భామండ్ల లక్ష్మీ నరసవ్వ--నరసయ్య దంపతులు తమ కన్న కొడుకులే అనాధలను చేశారంటూ కలెక్టర్కు ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు.వారికి ఉన్న ఐదు ఎకరాల భూమిని కొడుకులు బలవంతంగా రాయించుకున్నారని, తమ పేరిట బ్యాంకులో రుణం తీసుకుని వేధిస్తున్నారని వారు కన్నీరు మిన్నీరయ్యారు. కనీసం వృద్ధాప్య పింఛను అయినా ఇప్పించి తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను వేడుకున్నారు.

## ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయ శిక్షణ ప్రారంభం



రామడుగు, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): రామడుగు మండలంలోని పిఎం శ్రీ స్కూల్ కొత్తపల్లిలో ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయుల కోసం మూడు రోజుల ఇన్‌సర్వీస్ టీచర్ ట్రైనింగ్ కార్యక్రమం ప్రారంభమైంది.ఈ సందర్భంగా మండల విద్యాధికారి రంగనాథ శర్మ మాట్లాడుతూ ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకుని తెలుగు, గణితం, ఇంగ్లీష్ సబ్జెక్టులలో రెమిడీయేషన్ ప్రోగ్రామ్ ద్వారా తక్కువ స్థాయి విద్యార్థులను గుర్తించి వారి నైపుణ్యాలను మెరుగుపరచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ రవీందర్, శ్రీనివాస్, హరిప్రియతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సబ్‌స్టేషన్ పనులు వేగవంతం చేయాలని వినతి



కరీంనగర్ రూరల్, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 4వ డివిజన్ దుర్శేడ్, గోపాలపూర్ ప్రాంతాల్లో రూ.93 37, 93లతో మంజూరైన 32/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ భూపతి రవీందర్ వినతిపత్రం సమర్పించారు.జనాభా, కరెంటు లోడ్ పెరగడం వల్ల నిరంతరం విద్యుత్ అంతరాయం ఏర్పడి గృహోపకరణాలు దెబ్బతింటున్నాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ పనులను వేగవంతం చేసి సమస్యను పరిష్కరించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ, అదనపు కలెక్టర్‌ను కోరారు.

## ప్రతి ఇంటిపై సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలి మేయర్ కొలగాని శ్రీనివాస్



కరీంనగర్, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులను తగ్గించాలంటే ప్రతి కుటుంబం తమ ఇంటి పైకప్పుపై సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపు నిచ్చారు.అశోక్‌నగర్ కాలనీలో మానేరు పర్యావరణ సమితి ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, సోలార్ విద్యుత్ ద్వారా కాలుష్యం ఉత్పత్తి కాకపోవడంతో దీనిని గ్రీన్ ఎనర్జీగా పిలుస్తారని తెలిపారు. సోలార్ ప్లాంట్లతో విద్యుత్ బిల్లులు తగ్గడమే కాకుండా అదనంగా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు అందించి ఆర్థిక లాభం పొందవచ్చని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూర్య ఘర్ యోజన పథకం ద్వారా గృహాలపై సోలార్ ప్లాంట్ల ఏర్పాటు కోసం రూ.80 వేల వరకు సబ్సిడీ అందిస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకుని పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, కార్పొరేటర్లు గొట్టేముక్కుల ఉమారాణి వెంకటరమణ, వాసాల రమేష్, వంగల పవన్, కొలిపాక శ్రీనివాస్, మానేరు పర్యావరణ సమితి ప్రతినిధులు తోట లక్ష్మణ్ రావు, గంజి స్వరాజ్ బాబు, కొమురవెల్లి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చెస్ బోర్డులు పంపిణీ



కరీంనగర్, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): అంతర్జాతీయ చెస్ దినోత్సవం సందర్భంగా వావిలాలపల్లె ప్రభుత్వ ప్రైమరీ స్కూల్‌లో లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చెస్ బోర్డులు, బట్ట సంచులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ చిన్ననాటి నుంచే చెస్ నేర్పితే మేధాశక్తి, ఏకాగ్రత, క్రమశిక్షణ పెరుగుతాయని, తల్లిదండ్రులు పిల్లలను చదరంగం ఆటకు ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం బట్ట సంచులు పంపిణీ చేసి పాఠశాలలో చెట్టు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ కరీంనగర్ అధ్యక్షురాలు శివకాంత్ పటేల్, జోనల్ చైర్మన్ ముక్క శరత్ కృష్ణ, సెక్రటరీ బట్టు వినోద్, ట్రెజరర్ మెతుకు కృష్ణ చైతన్య, జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ కంకటి అనూప్ కుమార్, ప్రధానోపాధ్యాయురాలు కాపర్తి జ్యోతి లక్ష్మి, ఉపాధ్యాయురాలు కె. మమత, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి కలెక్టర్ కె. హైమావతి



సిద్దిపేట, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన వినతులను ఆలస్యం చేయకుండా అర్హతల మేరకు వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌తో కలిసి ప్రజల సమస్యలను స్వీకరించిన కలెక్టర్, ప్రజలు నమ్మకంతో సమర్పించిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 150 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు.తరువాత ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రూపొందించిన తెలంగాణ జల సిరి గోడపత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భవ్య, ఎస్‌డీసీ సుదర్శన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## బాలికల ఉన్నత విద్యకు అజీమ్ ప్రేమ్‌జీ స్కాలర్‌షిప్‌ల భరోసా



పెద్దపల్లి, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఉన్నత విద్యను అభ్యసిస్తున్న బాలికలకు అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ అందిస్తున్న స్కాలర్‌షిప్‌లు ఆర్థికంగా గొప్ప భరోసాగా నిలుస్తున్నాయని స్వేరోస్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపక కార్యదర్శి, ఐపీఎస్ (రిటైర్డ్) ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు.పెద్దపల్లి పట్టణంలోని ఆర్య వైశ్య భవనంలో సోమవారం స్వేరోస్ ఇంటర్నేషనల్, స్వేరోస్ విస్డం ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌ల పంపిణీ, విద్యార్థినుల సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ విద్యార్థినులను శాలువాలతో సన్మానించి అభినందించారు.డిగ్రీ, బీటెక్, బీఎస్సీ నర్సింగ్‌తో పాటు వివిధ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థినులకు కోర్సు పూర్తయ్యే వరకు ఏడాదికి రూ.30 వేల చొప్పున ట్యూషన్ ఫీజు, ఇతర విద్యా ఖర్చుల కోసం సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరానికి పెద్దపల్లి నియోజకవర్గంలో 100 మందికి పైగా విద్యార్థినులు ఎంపికయ్యారని, దాదాపు రూ.కోటి నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించు కోవాలని, విజయానికి క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర అధ్యయనం అవసరమని ఆయన సూచించారు. ప్రముఖుల జీవిత చరిత్రలను చదవడం ద్వారా స్ఫూర్తి పొందాలని, భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలు సాధించే దిశగా కృషి చేయాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో స్వేరోస్ నాయకులు కన్నూరి శ్రీశైలం, దాసరి ఉష, మేకల రవీందర్, వేల్పుల సురేందర్, కొంకణి శేఖర్, జిల్లా అధ్యక్షుడు మల్లారపు మహేందర్, ఉపాధ్యక్షుడు మనోహర్, ఫిట్ అండ్ ఫ్యూచర్ జిల్లా అధ్యక్షుడు మచ్చ రాహుల్‌తో పాటు పలువురు నాయకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి




### - కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు తో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించిన కలెక్టర్, వివిధ సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. గోదావరిఖని నివాసి శ్రీలత నర్సింగ్ ఉద్యోగం కోసం చేసిన వినతిని వారధి సోసైటీకి రాసి చర్యలు తీసుకోవాలని, జూలపల్లి మండలానికి చెందిన గడ్డం పద్మ, కోట ఉషశ్రీ భూమి విరాసత్ సమస్యను తహసిల్దార్ పరిశీలించాలని, ఎలిగేడు మండలానికి చెందిన తంగళ్ళ కుమారస్వామి పెండింగ్ బిల్లుల సమస్యను జిల్లా పంచాయతీ అధికారికి రాసి పరిష్కరించాలని, పెద్దపల్లి పట్టణానికి చెందిన బొడ్డుపల్లి శ్యామల ఇందిరమ్మ ఇండ్ల మంజూరు వినతిని పీడీ హౌసింగ్ అధికారికి రాసి చర్యలు తీసుకో వాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి దర ఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, సకా లంలో పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు.

## అమ్రాబాద్ పులుల సంరక్షణ అడవిలో గ్రామీణ భాగస్వామ్య సర్వే



అమ్రాబాద్, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): అమ్రాబాద్ పులుల సంరక్షణ అడవి పరిధిలో గ్రామీణ ప్రజల జీవన విధానాలు, సహజ వనరుల వినియోగం, ఉపాధి అవకాశాలు, అభివృద్ధి అవసరాలను తెలుసుకోవడానికి గ్రామీణ భాగస్వామ్య సర్వే నిర్వహించారు. ఈ సర్వేను ముంబాయి సామాజిక శాస్త్ర సంస్థ విద్యార్థిని తేజస్విని, హైదరాబాద్ పులుల సంరక్షణ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టారు.అమ్రాబాద్ డివిజన్ లోని ఉడిమిల్ల, మాచారం, చిట్లంకుంట, వెంకటేశ్వర్ల బావి, పెట్రాలచేను గ్రామాలు, అచ్చంపేట డివిజన్‌లోని ఎర్రపెంట, పద్మనపల్లి, దారారం గ్రామాల్లో సర్వే జరిగింది. గ్రామస్థులతో చర్చలు, వనరుల పటాలు, జీవనోపాధి వివరాల సేకరణ ద్వారా సమాచారం సేకరించారు. కుటుంబాల సామాజిక, ఆర్థిక పరిస్థితులు, చదువు, వైద్యం, ఉపాధి అవకాశాలు, అడవి వన రులపై ఆధారపడటం వంటి అంశాలను పరిశీలించారు. సేకరించిన వివరాలు గ్రామీణాభివృద్ధి, ఉపాధి మెరుగుదల, ప్రకృతి వనరుల పరిరక్షణ, ప్రజల భాగస్వామ్యంతో కూడిన సంరక్షణ కార్యక్రమాల రూపకల్పనకు ఉపయోగపడనున్నాయని ప్రతినిధులు బాపురెడ్డి, ప్రేమ్ కుమార్ తెలిపారు

## అదనపు కట్నం వేధింపులపై కలెక్టర్‌ను ఆశ్రయించిన మహిళ



పెద్దపల్లి, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): అదనపు కట్నం కోసం భర్త, కుటుంబ సభ్యులు వేధింపులకు గురిచేశారని ఆరోపిస్తూ పెద్దపల్లి జిల్లా భజ్జురి రేఖలత సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి న్యాయం చేయాలని కోరారు .రేఖలత తెలిపిన వివరాల ప్రకారం, భీమారం ప్రాంతానికి చెందిన ప్రవీణ్ కుమార్‌తో తన వివాహం జరిగిన తర్వాత కొంతకాలం దాంపత్య జీవితం సజావుగా సాగిందని, అనంతరం అదనపు కట్నం కోసం శారీరక, మానసిక వేధింపులకు గురిచేశారని పేర్కొన్నారు. గతంలో పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ భర్త ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని, వాట్సాప్ సందేశాలు, నోటీసుల ద్వారా వేధింపులు కొనసాగించాడని ఆరోపించారు.తన వద్ద ఉన్న బంగారు ఆభరణాలను తీసుకుని భౌతిక దాడులకు పాల్పడ్డారని, ప్రస్తుతం అద్దె ఇంట్లో జీవనం సాగిస్తున్నానని తెలిపారు. భర్త, ఆయన కుటుంబ సభ్యుల నుంచి ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు రక్షణ కల్పించాలని కలెక్టర్‌ను కోరారు.

## రేషన్ కార్డు సభ్యులందరూ కేవైసీ పూర్తి చేయాలి



కరీంనగర్, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): జిల్లా పరిధిలోని అన్ని ఆహార భద్రత రేషన్ కార్డు దారులు తమ కార్డులో నమోదైన ప్రతి సభ్యుని కేవైసీ ప్రక్రియను ఈ నెల 31వ తేదీలోపు తప్పనిసరిగా పూర్తి చేయాలని కమిషనర్, పౌరసరఫరాలు శాఖ ఆదేశాలు జారీ చేశారు.కేవైసీ ప్రక్రియను సమీపంలోని ఏదైనా చౌకధరల దుకాణంలో ఎటువంటి రుసుము లేకుండా ఉచితంగా పూర్తి చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. నిర్ణీత గడువులోపు 100శాతం కేవైసీ పూర్తి చేయాలని సూచించారు.

## బీజేపీ మండల నూతన కమిటీ ఏర్పాటు

హుస్నాబాద్, జూలై 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): బీజేపీ హుస్నాబాద్ మండల పార్టీ నూతన కార్యవర్గాన్ని, వివిధ మోర్చాల మండల అధ్యక్షులను మండల అధ్యక్షుడు భూక్య సంపత్ నాయక్ ప్రకటించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ఆదేశాల మేరకు జాతీయ--రాష్ట్ర పార్టీ మార్గదర్శకాల ప్రకారం నియామకాలు చేసినట్లు తెలిపారు.నూతన కమిటీలో ఉపాధ్యక్షులుగా భూతగడ్డ బాలరాజు, రాగుల చంద్రశేఖర్ రెడ్డి, కుంట మల్లయ్య, బత్తుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులుగా తడిసిన రమేష్ రెడ్డి, బైరి అరుణ్, కార్యదర్శులుగా బాలగోని మల్లేష్, నార్లపురం సత్యం, తాళ్లపల్లి చంద్రం, బాషవేణి వెంకటేష్, కోశాధికారిగా కనకంట్ల కిషన్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వెంకటేశం, జిల్లా ఉపాధ్యక్షుడు మాచర్ల కుమార్, జిల్లా కార్యదర్శి పైడిపల్లి పృథ్వీరాజ్ సహకరించినందుకు సంపత్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా నియమితులైన నాయకులు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీని బలోపేతం చేసేందుకు సమిష్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ నియామకాలు వెంటనే అమల్లోకి వస్తాయని మండల అధ్యక్షుడు వెల్లడించారు.

## ప్రాడిజీ విజేతల వేడుకలో విద్యార్థులను అభినందించిన మేయర్




కరీంనగర్, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఎస్ఐపీ అబాకస్ సీతారాంపూర్ సెంటర్ ఆధ్వర్యంలో జూలై 12న శంషాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ప్రాడిజీ--2026 పోటీల విజేతల వేడుకను కరీంనగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ నాయకులు కర్రె అనిల్ కుమార్, ఆర్ఐ కుమారస్వామి, విజిలెన్స్ శాఖ సతీష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.మేయర్ విద్యార్థులను అభినందిస్తూ, వారి ప్రతిభను మరింత అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. మొత్తం 41 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో 8 మంది మొదటి బహుమతి, 5 మంది రెండో బహుమతి, 7 మంది మూడో బహుమతి, 18 మంది ఉత్తమ ప్రదర్శన అవార్డులు సాధించారు.తెలంగాణ ప్రాంతీయ ప్రాడిజీ పోటీల్లో 63 సెంటర్లు పాల్గొనగా, సీతారాంపూర్ సెంటర్ రాష్ట్రంలో 3వ స్థానం సాధించడం విశేషం. ఈ విజయానికి తోడ్పడిన ఎల్‌సీఎల్ స్వరూప, టీచర్లు రజిత, శిరీష, హేమలత, విద్యార్థులు, తల్లిదండ్రులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## 80శాతం ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయింది ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



గంగాధర, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజ కవర్గంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో ఇప్పటికే 80% పూర్తయిందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. సోమ వారం గంగాధర మండలం మధురనగర్‌లో సర్ కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ, సర్ ద్వారా ఓటరుగా గుర్తింపు పొందవచ్చని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో బిఎల్వోలు ఎన్యుమరేషన్ ఫారాలను అందజేసినందున ప్రజలు వాటిని సకాలంలో నింపి సహకరించాలని కోరారు. మరణించిన వారి, డబుల్ ఓట్లను తొలగించడానికి సర్ ప్రక్రియ ఉపయోగపడుతుందని, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజలకు, బిఎల్వోలకు సహకరించాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరి సహకారంతో సర్ ప్రక్రియ విజయవంతం కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రాము, ఎమ్మార్వో రజిత, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మంత్రి మహేందర్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షు రాలు చిరుత మంగ, సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిరుమల్ రావు, జిల్లా కాంగ్రెస్ ఉపా ధ్యక్షులు పురుమల్ల మనోహర్, మాజీ జెడ్పిటిసి సత్తు కనకయ్య, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు ముద్దం నగేష్, సర్పంచ్‌లు, యువజన కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా శాఖల అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి ప్రజల నుంచి 313 దరఖాస్తులను స్వీకరించారు. వీటిలో గృహని ర్మాణ శాఖకు అత్యధికంగా 100 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.30 రోజులకు పైగా పెండిం గ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, కోర్టు కేసులు, సీఎం ఆఫీస్, ట్విట్టర్‌లో వ చ్చిన ఫిర్యాదులను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచి ంచా రు. పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను లాగిన్‌లో అప్డేట్ చేయాలని అధికారులకు ఆదేశించారు

## టెక్నికల్ డ్రాయింగ్, టైలరింగ్ పరీక్షల నిర్వహణ

**కరీంనగర్, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ పరీక్షల సంచాలకుల ఆదేశాల మేరకు ఆగస్టు 2న టెక్నికల్ డ్రాయింగ్, టైలరింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ ప్రకటించింది. 42 రోజుల ట్రైనింగ్ పూర్తి చేసిన విద్యార్థులు జూలై 20 నుండి వెబ్‌సైట్‌లో తమ పేరు, పుట్టిన తేదీ, ట్రైనింగ్ సెంటర్ వివరాలు నమోదు చేసి హాల్ టికెట్ పొందవచ్చని అధికారులు తెలిపారు. అర్హులైన విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాలని విద్యాశాఖ సూచించింది.

## మున్నూరు కాపు పెద్ద సంఘం అధ్యక్షుడిగా నాయిని సంతోష్ నియామకం



**ఖానాపూర్, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మున్నూరు కాపు పెద్ద సంఘం నూతన అధ్యక్షుడిగా నాయిని సంతోష్‌ను సోమవారం సంఘ భవనంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంతోష్ మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో ఐదవ స్థానం సాధించిన రాగం గణేష్ కుమార్తె రాగం విజ్ఞతను సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ తోట సత్యం, మాజీ చైర్మన్ పాదం రాజన్న, నాయిని రవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలలో ఘనంగా బోనాల పండుగ



**ఖానాపూర్, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ పట్టణంలోని రాజీవ్ నగర్ ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులతో తెలంగాణ సంప్రదాయ బోనాల పండుగను నిర్వహించారు. పోతురాజుల ఊరేగింపులో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ రాజూర సత్యం విద్యార్థులతో కలిసి పాల్గొని, సంప్రదాయ పద్ధతిలో బోనాలు నిర్వహించిన పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గేయలత, రాజమణి, విజయలక్ష్మి, రామలక్ష్మి, సునీతతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గాయత్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వరుణ యాగం నిర్వహణ



**ఖానాపూర్, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ పట్టణ గాయత్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సోమవారం వరుణ పాశుపతి సాహిత వరుణ హోమ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ రాజూర సత్యం అమ్మవారిని దర్శించుకున్నారు. సంఘ అధ్యక్షుడు సందీప్ శర్మ మాట్లాడుతూ, వర్షాభావం కారణంగా రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున పుష్కల వర్షాలు కురవాలని, పంటలు సమృద్ధిగా రావాలని ఉద్దేశంతో యాగం నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు రాజు, రాఘవేంద్ర శర్మ, నిమ్మగడ్డ నాగరాజు, శరత్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ భవిష్ మిశ్రాకు వినతి



**ఖానాపూర్, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ యువకులు జిల్లా కలెక్టర్ భవిష్ మిశ్రాకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. విద్యుత్ స్తంభాలు రోడ్డు విస్తరణకు అడ్డంకిగా మారుతున్నందున వాటిని తొలగించేందుకు అవసరమైన నిధులను విద్యుత్ శాఖకు తక్షణమే విడుదల చేయాలని, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేలా పనులను వేగవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాపెల్లి రాజు యాదవ్, కోరెండ్ల సుధీర్, గాంధారి నరేంద్రనాథ్, సుర శ్రీనివాస్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫారం పాండు నిర్మాణానికై భూమి పూజ చేసిన ఎంపీడీవో రాధా రాథోడ్



**ఖానాపూర్, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మండలంలోని సింగపూర్ గ్రామపంచాయతీలో బివిజి రాంజీ పథకం కింద మంజూరైన ఫారం పాండు నిర్మాణానికి సోమవారం ఎంపీడీవో రాధా రాథోడ్ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షపు ప్రతి చుక్కను భూగర్భ జలాల పెంపుకు వినియోగించుకోవాలని, ప్రతి ఇంట ఇంకుడు గుంత, పొలాల్లో పూటకుంటలు నిర్మించుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు, అధికారులు పాల్గొన్నారు.

## కోమాండ్ల మల్లారెడ్డి చిత్రపటానికి ఈగ మల్లేశం నివాళి



**వర్ధన్నపేట, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వర్ధన్నపేట మున్సిపాలిటీ మాజీ వైస్‌చైర్మన్ కోమాండ్ల ఎలేందర్ రెడ్డి కుటుంబాన్ని కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ఆదివారం పరామర్శించారు. ఇటీవల చోటుచేసుకున్న విషాద ఘటన నేపథ్యంలో ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం దివంగత కోమాండ్ల మల్లారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. "ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను" అని ఈగ మల్లేశం పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిలివేరు కుమార్ స్వామి, కోమాండ్ల వెంకట్ రెడ్డి, కరిమిళ్ళ వెంకటేశ్వర్ రావు, కోమాండ్ల సాయి రెడ్డి, పెద్దూరి రాజకుమార్, కుడికందుల సంపత్, బక్కతట్ల రాజు, పూజారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే తొలగించాలని ఏఐవైఎఫ్ డిమాండ్



**దేవరకొండ, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** డిండి మండలంలోని సిపిఐ ప్రజాభవన్లో సోమవారం జరిగిన సమావేశంలో అఖిల భారత యువజన సమాఖ్య నాయకులు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఎనమల్ల నవీన్ మాట్లాడుతూ, "దేశంలో పరీక్షా పత్రాల లీకేజీకి బాధ్యత వహించాల్సిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే మంత్రి పదవి నుండి తొలగించాలి. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్ చుక్‌ను పోలీసులు బలవంతంగా హాస్పిటల్‌కు తరలించడం సిగ్గుచేటు" అని అన్నారు. అతను మరింతగా, "పార్లమెంట్ ముట్టడికి శాంతియుతంగా వెళ్లిన విద్యార్థులు, నిరుద్యోగులపై టియర్ గ్యాస్ ప్రయోగించి లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. విద్యార్థులు, యువత అంతా చైతన్యమై కేంద్ర విద్యాశాఖ మంత్రిని తొలగించే వరకు పోరాటం ఆపకూడదు" అని పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ నాయకులు, "సిజేపి చేస్తున్న పోరాటానికి మద్దతు ఇస్తున్నాం. భవిష్యత్తులో ఈ ఉద్యమం తీవ్రరూపం దాల్చేలా కలిసి పోరాటాలకు సిద్ధమవుతున్నాం" అని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షులు, కార్యదర్శులు ఆర్కపల్లి మహేష్, ఎలిమినేటీ నరేష్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## గట్టు ఇప్పలపల్లిలో నేడు సత్యనారాయణ స్వామి వ్రతం

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాధవి దంపతులు వ్రతం నిర్వహణ..**
**- భక్తులు, కాంగ్రెస్ శ్రేణులు భారీగా పాల్గొనాలని పిలుపు**



**ఆమనగల్లు, జూలై 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తలకొండపల్లి మండలంలోని గట్టు ఇప్పలపల్లి గ్రామం బండలగడ్డ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం ప్రాంగణంలో నేడు (మంగళవారం) ఉదయం 11:30 గంటలకు శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఆయన సతీమణి కసిరెడ్డి మాధవి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించనున్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందనున్నారు. ఈ పవిత్ర కార్యక్రమానికి తలకొండపల్లి మండలంతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. భక్తులందరూ స్వామి వారి దర్శనం, తీర్థప్రసాదాలను స్వీకరించి ఆధ్యాత్మిక వేడుకలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

## వాన దేవుడా.. రైతన్నను ఆదుకోవా..!

**- కడ్తాల్‌లో బొడ్రాయికి మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు**



**ఆమనగల్లు, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వర్షాభావంతో అల్లాడుతున్న రైతాంగానికి ఉపశమనం కలగాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పుష్కలంగా పండాలని ఆకాంక్షిస్తూ కడ్తాల్ గ్రామంలో సోమవారం మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో గ్రామ దేవత బొడ్రాయికి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బొడ్రాయికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ వాన దేవుడు కరుణించి రైతుల కష్టాలను తొలగించాలని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహారెడ్డి మాట్లాడుతూ సరైన సమయంలో వర్షాలు కురవకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని అన్నారు. సాగు పనులు నిలిచిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయని, పంటలు ఎండిపోయే ప్రమాదం నెలకొన్నందున గ్రామ ప్రజలంతా కలిసి గ్రామ దేవతను ప్రార్థించామని తెలిపారు. ప్రకృతి అనుగ్రహించి విస్తారంగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండాలని, రైతుల శ్రమకు తగిన ఫలితం దక్కాలని, పల్లెల్లో మళ్లీ సంతోషం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. బొడ్రాయి ఆశీస్సులతో త్వరలోనే మంచి వర్షాలు కురిసి రైతన్న ముఖంలో చిరునవ్వు చూడాలని గ్రామస్తులంతా మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కడారి రామకృష్ణ, గూద రాములు, ఎలగమోని సత్యం, మూడ అశోక్, బోసు బుచ్చయ్య, సురేష్, అమృతం పాండు, మీగడి అంజయ్య, సిరిగిరి రవి, జంగా చారి, దేవమ్మ, చంద్రకళ, నవీన్, సురేష్‌తో పాటు గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ విజయవంతానికి ప్రజలందరూ సహకరించాలి

**- మాజీ ఎంపీటీసీ నిట్ట నారాయణ**



**ఆమనగల్లు, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఆమనగల్లు మండల ప్రజలు విజయవంతం చేయాలని మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నిట్ట నారాయణ పిలుపునిచ్చారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఎస్ఐఆర్ ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొని తమ ఓటరు వివరాలను నమోదు చేయించుకోవాలని కోరారు. ఓటరు జాబితాలో పేరు లేని వారు, వివరాల్లో మార్పులు ఉన్న వారు లేదా కొత్తగా ఓటరుగా నమోదు కావాల్సిన వారు నిర్ణీత గడువు లోపు సంబంధిత అధికారులను సంప్రదించి దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ప్రజలంతా బాధ్యతగా వ్యవహరించి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా ప్రజల్లో అవగాహన కల్పించి కార్యక్రమం విజయవంతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## ఆమనగల్లు మండలాన్ని తడిపిన వానజల్లులు

**- రైతులు, ప్రజల్లో ఆనందం.. ఖరీఫ్ సాగుపై చిగురించిన ఆశలు**



**ఆమనగల్లు, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మండల వ్యాప్తంగా సోమవారం సాయంత్రం కురిసిన వర్షాలు రైతులు, ప్రజల్లో ఆనందాన్ని నింపాయి. గత కొన్ని రోజులుగా మండుతున్న ఎండలు, ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఈ వర్షం భారీ ఊరటనిచ్చింది. మండలంలోని పలు గ్రామాల్లో జల్లులు పలకరించడంతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. వర్షం రావడంతో రైతుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. ఖరీఫ్ సాగుకు ఈ వర్షాలు ఎంతో ఉపయోగపడతాయని, పంటల సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. భూగర్భ జలాల మట్టం పెరగడంతో పాటు పశువులకు, పంటలకు ఈ వర్షాలు మేలు చేస్తాయని పేర్కొన్నారు. మొత్తం మీద ఆమనగల్లు మండలాన్ని తడిపిన ఈ వానజల్లులు రైతాంగంతో పాటు ప్రజల్లో కొత్త ఆశలను నింపాయి.

## బట్లపల్లి గ్రామంలో సాటిలైట్ రోవర్ రీ సర్వే ప్రారంభం



**మర్రిగూడ, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండలంలోని బట్లపల్లి గ్రామంలో సోమవారం సాటిలైట్ రోవర్ ద్వారా రీ సర్వే కార్యక్రమం ప్రారంభమైంది. మండల తహసిల్దార్ జక్కర్తి శ్రీనివాసులు ఈ సర్వేను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, "మొదటగా గ్రామ సరిహద్దులను సర్వే చేసి, అనంతరం ప్రభుత్వ, అటవీ, గ్రామ కంఠం, చెరువులు, శిఖాలు వంటి భూములను గుర్తిస్తాం. తరువాత ప్రతి రైతు భూమికి సర్వే చేసి ల్యాండ్ పార్సెల్ మ్యాప్ నంబరు కేటాయిస్తాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వట్టిపల్లి గ్రామ సర్పంచ్ సిరిసవాడ బిక్షం, మండల సర్వేయర్ గిర్దావర్, జి.పి.ఓలు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

## చలో మాల నల్లగొండ కలెక్టరేట్



**దేవరకొండ, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణలో మాలలకు అన్యాయం చేసిందని మాల మహానాడు దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు బోయిని చంద్రమౌళి ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ, "సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్‌ను పక్కన పెట్టి, 2011 జనాభా లెక్కల ఆధారంగా వర్గీకరణ చేసి మాల జనాభాను తక్కువ చూపిస్తూ కేవలం 5% కేటాయించడం అన్యాయం. రోస్టర్ విధానంలో కూడా మాలలకు తీవ్ర నష్టం జరిగింది" అని అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్ వద్ద మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి పిలుపు మేరకు రిలే నిరాహార దీక్ష జరుగుతుందని, దేవరకొండ నియోజకవర్గంలోని అన్ని మండలాల నుండి మాల మేధావులు, యువకులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి దీక్షను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే, "రోస్టర్ విధానంపై అసెంబ్లీ సమావేశాల్లో మాల మంత్రులు, ఎమ్మెల్యేలు, శాసనమండలి సభ్యులు చర్చ జరిపి 1 నుండి 16 లోపు రెండు రోస్టర్ పాయింట్లు వచ్చేలా సవరణ చేయాలి. లేకపోతే 'మాలల పంతం కాంగ్రెస్ అంతం' అనే నినాదంతో భవిష్యత్ కార్యాచరణ చేపడతాం" అని హెచ్చరించారు. చంద్రమౌళి మాట్లాడుతూ, "ప్రజాస్వామ్యంలో మాలలు మేలుకోకపోతే రాబోయే తరాలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. బాబా సాహెబ్ అంబేద్కర్ మనకు హక్కులు సాధించగలిగిన కారణం ఆయన పదవుల కోసం రాజీనామా చేయగల ధైర్యం చూపినందువల్లే. అదే స్ఫూర్తి మన ప్రజా ప్రతినిధుల్లో ఉండాలి" అని అన్నారు.

## రూ.30.50 కోట్లతో మర్రిగూడలో ఆర్ అండ్ బి రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**మర్రిగూడ, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండలం శివన్నగూడెం గ్రామంలో సోమవారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రూ.30 కోట్ల 50 లక్షల వ్యయంతో 9.2 కిలోమీటర్ల మేర చేపట్టనున్న ఆర్ అండ్ బి రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన రహదారుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఈ రహదారి పూర్తయిన అనంతరం ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయం, వాణిజ్య రంగాలకు ఎంతో ఉపయోగపడుతుంది" అని పేర్కొన్నారు. శివన్నగూడెం నుండి ఇందుర్తి, కొట్టాల, నామాపురం, తేరటిపల్లి గ్రామాల వరకు ఈ రహదారి నిర్మాణం జరగనుంది. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి అధికారులు, స్థానిక నాయకులు, మండల అధ్యక్షులు, అన్ని గ్రామాల సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మాన్యంచెల్క పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న డాక్టర్, స్టాఫ్ నర్స్ ఫార్మసిస్ట్ పోస్టులను భర్తీ చేయాలి



**నల్లగొండ, జూలై 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** మాన్యం చెల్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న డాక్టర్, స్టాఫ్ నర్స్, ఫార్మసిస్ట్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షులు కత్తుల లింగస్వామి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు దండంపల్లి సరోజ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నాడు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు నల్లగొండ పట్టణంలోని మన్యం చెల్క ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సర్వే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో ఇన్వర్టర్ లేకపోవడంతో విద్యుత్ అంతరాయం మూలంగా వ్యాక్సిన్ కు రోగులు, వైద్య సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రోగులకు త్రాగే నీరు కొరకు ఫ్రిజ్ ను ఏర్పాటు చేయాలని, ఆసుపత్రి నిర్వహణకు అవసరమైన నిధులు రెండు సంవత్సరాల నుండి విడుదల కాలేదని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసి, ఆరోగ్య కేంద్రానికి అవసరమైన నిధులు, మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు మన్నెంబిక్షం, నాయకులు మధు, అంజయ్య, రాజ్ కుమార్, నాగమణి, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరెడ్డి



**ఆమనగల్, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్ మండల మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంత్ రెడ్డి సోమవారం తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామివారిని వీవీఐపీ బ్రేక్ దర్శనం ద్వారా దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆలయ వేద పండితులచే వేద ఆశీర్వచనం స్వీకరించి శ్రీవారి తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఈ సందర్భంగా వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ రాహుల్ వెంకటేశ్వర రెడ్డి, అచ్చంపేట మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు శ్రవణ్ కుమార్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, రమాకాంత్ రెడ్డి తదితరులు ఆయన వెంట ఉన్నారు. అనంతరం రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని, రైతులు, ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని శ్రీవారిని ప్రత్యేకంగా ప్రార్థించినట్లు జక్కు అనంత్ రెడ్డి తెలిపారు. శ్రీవారి దివ్య అనుగ్రహం అందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

# కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

## -ఎస్ఎఫ్ఐ డిమాండ్




దేవరకొండ జూలై 20.(నీలగిరి ఎక్స్ ప్రెస్) :ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కమిటీ సమావేశం నిర్వహించిన అనంతరం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని,ఢిల్లీలో నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న వారికి మద్దతుగా- ఎన్ టి ఏను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేవర కొండ పట్టణ కేంద్రంలో ర్యాలీ నిర్వహించి అనంతరం జాతీయ రహదారిపై నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ మాట్లాడుతూ..దేశవ్యాప్తంగా కోట్లాది కుటుంబాల ఆశలను మోస్తున్న నీట్-2026 పరీక్ష మరోసారి అవినీతి, నిర్లక్ష్యం, కోచింగ్ మాఫియా -- అధికార యంత్రాంగం కుమ్మక్కు కారణ ంగా విద్యార్థుల శాపంగా మారిందనిఅన్నారు.నీట్ పరీక్షను పారదర్శకంగా నిర్వహించడంలో పూర్తిగా విఫలమైన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని నీట్-2026 పరీక్షలో పేపర్ లీకేజీ, భారీ అక్రమాలు వెలుగులోకి రావడం మోడీ ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు.సుమారు 22.79 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు నేడు అంధకారంలో పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 2024లో జరిగిన పేపర్ లీక్ ఘటనపై అప్పట్లోనే కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే నేడు ఇంత పెద్ద స్కాండల్ పునరావృతమైందని,పరీక్షా వ్యవస్థను కేంద్రం కోచింగ్ మాఫియాకు,కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టిందని ఆరోపించారు.ఈ వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని,విఫలమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీను రద్దు చేయాలని లేదా పూర్తిగా ప్రక్షాళన చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తోంది. నీట్-2026 పరీక్షను వెంటనే రద్దు చేసి, ఎటువంటి అదనపు ఫీజులు లేకుండా సుప్రీంకోర్టు పర్యవేక్షణలో న్యాయ విచారణ జరిపి పారదర్శకంగా మళ్లీ నిర్వహించాలని కోరారు. లీకేజీకి కారణమైన అధికారులు, మధ్యవర్తులు, కోచింగ్ మాఫియాను వెంటనే అరెస్ట్ చేయాలని, నష్టపోయిన విద్యార్థులకు మానసిక, ఆర్థిక పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశార ు.అం తేకాక ుండా, రాష్ట్రాలకు తమ స్వంత ప్రవేశ పరీక్షలు నిర్వహించుకునే హక్కును కల్పించాలని, విద్యను కార్పొరేట్ వ్యాపారంగా మార్చే విధానాలను ఉపసంహరించుకోవాలని స్పష్టం చేశారు.

కాక్రోక్ జనతా పార్టీ గత కొన్ని రోజులుగా జంతర్ మంతర్ వద్ద నిరవధిక దీక్ష చేపట్టిన కేంద్ర ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదు. కేంద్ర ప్రభుత్వం శానిటేషన్ పనులను నిలిపివేసి, వాటరు, కరెంటు సౌకర్యాలు లేకుండా, కనీసం నిరసన కోసం వేసుకున్న టెంట్లను ప్రయోగిస్తూ నిరాహార దీక్ష చేస్తున్న నాయకుల పాడవుతున్న కనీసం కేంద్ర ప్రభుత్వం స్పందించట్లేదని, వెంటనే కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేశారు.పరీక్షల రద్దుతో పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని, విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దేశ యువత భవిష్యత్తుతో ఆడుకుంటున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా పోరాటాలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్,వినోద్ జయరాం,సుధాకర్,పరమేష్, మహేష్,సాయిరాం,జోసెఫ్,మణికంఠ,శివ, సతీష్,రవి, ప్రవీణ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# యువతతోనే పార్టీ బలోపేతం.. అంకితభావంతో పనిచేయాలి

## - తల్లోజు ఆచారి



ఆమనగల్లు, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): యువత పార్టీ బలోపేతంలో కీలక పాత్ర పోషించాలని, అంకితభావంతో పనిచేస్తూ బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ సీనియర్ నాయకులు, మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి పిలుప నిచ్చారు. నూతనంగా బీజేవైఎం నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన నరేష్ చారి సోమవారం తల్లోజు ఆచారిని మర్యాద పూర్వక ంగా కలిసి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం తల్లోజు ఆచారి మాట్లాడుతూ యువతను సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, జిల్లాలో బీజేపీని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని సూచించారు. నూతన బాధ్యతలను సమర్థవ ంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. నరేష్ చారి మాట్లాడుతూ తనపై పార్టీ ఉంచిన నమ్మకాన్ని నిలబెటు కుంటూ పార్టీ ఆశయాల సాధనకు అంకితభా వంతో పనిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆమనగల్ మున్సిపల్ కౌన్సిలర్ సునీత ప్రశాంత్ నాయక్, కల్వకుర్తి కౌన్సిలర్ రాంభూపాల్ రెడ్డి, బోడ నరసింహ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దుర్గాప్రసాద్, మాజీ కౌన్సిలర్లు కృష్ణ యాదవ్, రాఘవేందర్ గౌడ్, శేఖర్ రెడ్డి, సర్పంచ్ మహేష్ సర్కార్, ఆమనగల్ మండల అధ్యక్షుడు కేకే శ్రీనివాస్, నాగర్‌కర్నూల్ పార్లమె ంట్ బీజేవైఎం కో-కన్వీనర్ నేనావత్ రవి రాథోడ్, బీజేవైఎం అసెంబ్లీ కో-కన్వీనర్ రాజ శేఖర్, రవి గౌడ్, పద్య నాయక్, సంజీవ నాయ క్, సుమన్ నాయక్‌తో పాటు బీజేపీ నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# దేవరకొండలో తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలి



దేవరకొండ, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):నల్లగొండలో ఎల్-నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం అంశాలపై జరిగిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ నియోజకవర్గ ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర మంత్రులను కోరారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిరంత రాయంగా తాగునీరు అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను వెంటనే కల్పించాలని విజ్ఞప్తి చేశారు .పెండ్లిపాకల 7 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ వద్ద ఇటీవల మరమ్మత్తులు చేసిన 33/415 ట్రాన్స్‌ఫార్మర్‌కు అదనంగా మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని, బాట్లపల్లి పంప్‌హౌస్‌లో అదనపు మోటార్‌ను అమర్చాలని ఆయన మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రతిపాదనలు అమలైతే తాగునీటి సరఫరాలో ఎలా ంటి అంతరాయం ఉండదని వివరించారు.అలాగే డిండి ప్రాజెక్టు నుంచి ఇప్పటికే సాగునీటిని విడుదల చేసినందున, ప్రాజెక్టులో తగినంత నీటి నిల్వలు ఉన్న నేపథ్యంలో వానాకాలం పంటలకు ఆటంకం లేకుండా సాగునీరు అందించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కోరారు. దీనిపై మంత్రి వెంటనే స్పందించి, రైతులకు నిరంతరాయంగా సాగునీరు అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబ ంధిత అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ రానున్న ఎల్-నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నందున రైతులు నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వ్యవసాయ శాఖ సూచనలను పాటిస్తూ పంటల ఎంపిక చేసుకుంటే రైతులు నష్టాలను తగ్గించుకోవచ్చని అన్నారు.నియోజకవర్గ ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు నిరంతరాయంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి




ఆమనగల్లు, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కడ్తాల్ మండలంలోని సరికొండ గ్రామానికి చెందిన గీత కార్మికుల అకాల మరణాలతో బాధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నాయని, వారికి ప్రభుత్వం వెంటనే ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకోవాలని కోరుతూ సోమవారం ఆమనగల్ మండల ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ బద్య నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. అలాగే విధి నిర్వహణలో ప్రమాదాలకు గురై గాయపడిన గౌడ కార్మికులకు తగిన ఆర్థిక సహాయం, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సరికొండ గ్రామ సర్పంచ్ మహేందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటయ్య గౌడ్ మాట్లాడుతూ గీత కార్మికుల జీవన భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రమాద బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా నిలవాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ బద్య నాయక్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వ నిబంధనల మేరకు పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ 38వ అధ్యక్షుడిగా సోమ వేణుగోపాల్

- ఘనంగా ప్రమాణ స్వీకార మహోత్సవం
- నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపిన రోటరీ క్లబ్‌ల అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు,పలువురు ప్రముఖులు




వరంగల్,జులై 20(నీలగిరి ఎక్స్ ప్రెస్):వరంగల్ హంటర్ రోడ్‌లోని పీఆర్ఆర్ వేడుకల మందిరంలో రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ 38వ అధ్యక్షుడిగా సోమ వేణుగోపాల్, కార్యదర్శిగా నాయిని అనిల్ కుమార్, కోశాధికారిగా జూలూరి కృష్ణమూర్తి ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు.

ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ సంవత్సర కాలానికి నా వంతుగా పూర్తి సహకారం అందిస్తానని అన్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన సేవా కార్యక్రమాల్లో భాగంగా దాత నాయిని ఫౌండేషన్ చైర్మన్ నాయిని అనిల్ కుమార్ ఐదు కుట్టు మిషన్లు అందజేశారు.అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలకు ఐదు సీలింగ్ ఫ్యాన్లు,ములుగు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు రెండు బీరువాలను అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాబోయే రోటరీ గవర్నర్ ఎం.హరిహర ప్రసాద్, డా.సి.శరత్ బాబు హాజరై మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా సేవా కార్యక్ర మాల్లో రోటరీ సంస్థ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని పేర్కొన్నారు. రోటరీ సభ్యులు తమ సంపాదనలో కొంత భాగాన్ని సమాజ సేవకు వెచ్చిస్తూ పేదలకు కుట్టు మిషన్లు, ప్రభుత్వ పాఠశాలలకు సైకిళ్లు, వాటర్ ప్లాంట్లు, అనాథాశ్రమాలకు మంచాలు, నిత్యావసర వస్తువులు అందిస్తూ సమాజాభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. అలాగే ప్రపంచవ్యాప్తంగా పోలియో నిర్మూలన కోసం నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ కార్యక్రమంలో రోటరీ కీలక పాత్ర పోషిస్తూ విశేష సేవలు అందిస్తోందని కొనియాడారు.ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు ఏజీ పోరండ్ల రత్నాకర్ రావు, మాదూరి గణేష్, భేతి అశోక్ బాబు, తోట సంపత్, శ్రీకర్, వినయ్ ప్రసాద్, కోరే చంద్రమౌళి, పొన్న హరినాథ్, బండారు కుమారస్వామి, మొగిలి చంద్రతో పాటు హనుమకొండ, వరంగల్, నర్సంపేట, మహబూబాబాద్ రోటరీ క్లబ్‌ల అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు మరియు పలువురు ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ కమిటీ జాయింట్ సెక్రటరీ గా శ్రీకాంత్ గుప్త



హైదారాబాద్, జులై 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్ ) : తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ కమిటీ జాయింట్ సెక్రటరీ గా శ్రీకాంత్ గుప్త కు నియామక పత్రం అందజేసిన రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరా వాది లక్ష్మి నారాయణ గుప్త . ఈ సందర్భంగా శ్రీకాంత్ గుప్త మాట్లాడుతూ... ఈ అవకాశం కల్పించిన పెద్దలకు మరియు రాష్ట్ర పొలిటికల్ కమిటీ చైర్మన్ ఆగిరి వెంకటేష్, గందె రాజ్ కుమార్ (రాజ్ మామ ) కి మరియు నా బాస్ నిజామాబాదు అభివృద్ధి ప్రధాత మాజీ శాసనసభ్యులు బిగాల గణేష్ గుప్త కి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. నా పై నమ్మకంతో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ కమిటీ జాయింట్ సెక్రటరీ పదవి ఇచ్చినందుకు ఆర్య వైశ్య సంఘం కీర్తి ప్రతిష్టలు పెంపొం దించ డానికి కృషి చేస్తానని ఆర్యవైశ్యులకు అం దుబా టులో ఉండి సహకారాలు అందిస్తానని తెలిపారు.

# నీట్ పేపర్ లీకేజ్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి : సిఐటియు



నల్లగొండ,జులై 20( నీలగిరి ఎక్స్ ప్రెస్):నీట్ పేపర్ లీకేజ్‌కు పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కొనసాగుతున్న ఆందోళనలు, నిరాహార దీక్షలకు మద్దతుగా సిఐటియు అఖిల భారత కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు సిఐటియు నల్లగొండ పట్టణ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద నల్ల జెండాలు, నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి యం.డి.సలీమ్, జిల్లా ఉపాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య లు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన నీట్ పరీక్షలో జరిగిన పేపర్ లీకేజ్ అత్యంత తీవ్రమైన అంశమని అన్నారు. పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, దీనికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.విద్యా వ్యవస్థను కార్పొరేట్ శక్తులకు అప్పగించే విధానాలను విరమించుకోవాలని, పారదర్శకంగా పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఈ అంశంపై దేశవ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమాలకు ప్రజలు, విద్యార్థులు, యువజనులు సంఘీభావం తెలపాలని పిలుపునిచ్చారు.ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిన్నపాక లక్ష్మీ నారాయణ, ఏర్పుల యాదయ్య, అవుట రవీందర్, నాయకులు పోలె సత్యనారాయణ, సలివొజు సైదాచారి, గంజి రాజేష్, వరికుప్పల ముత్యాలు, పాక లింగయ్య, దేవరంపల్లి వెంకట రెడ్డి, నోముల యాదయ్య, బిమనపల్లి శంకర్, సాగర్ల మల్లయ్య, జేరిపోతుల యాదయ్య, పిడమర్తి శంకర్, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వరుణదేవుడి కటాక్షం కోసం 23న వరద పాశకం



ఆమనగల్లు, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు, ప్రజలకు ఉపశమనం కలిగేలా వరుణదేవుడి అనుగ్రహం కోసం ఈ నెల 23న ఆమనగల్ పట్టణంలో సంప్రదాయబద్ధంగా వరద పాశకం కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ తెలిపారు. ఈ మేరకు సోమవారం పట్టణ కేంద్రంలోని అంగడి బజార్ హనుమాన్ దేవాలయంలో గ్రామ పెద్దలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి కార్యక్రమ ఏర్పాట్లపై చర్చించారు. సరైన సమయంలో వర్షాలు కురవక రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఆనవాయితీ ప్రకారం పట్టణంలోని దేవాల యాలను సుందరీకరించి ప్రత్యేక పూజలతో వరద పాశకం నిర్వహించాలని సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు తెలిపారు. జూలై 23 గురువారం జరిగే కార్యక్రమంలో పట్టణ ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పత్య నాయక్ పిలుపునిచ్చారు. సమావేశంలో కౌన్సిలర్లు మొక్తల వెంకటయ్య, నాగిళ్ల జగన్, మల్యా నాయక్, కో-ఆప్షన్ సభ్యుడు చుక్క అల్లాజీ గౌడ్, గ్రామ పెద్దలు గుర్రం కేశవులు, వస్పుల జంగయ్య, వస్పుల మానయ్య, గంగిశెట్టి మల్లయ్య, కాలే మల్లయ్య, దూసకంటి యాదయ్య, పులికంటి మైసయ్య, రాగ్యా, చంద్రయ్య, జంతుక శంకర్, రేవల్లి రాజు, సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆస్పత్రి పనుల్లో నాణ్యతకు రాజీ లేదు.. గడువులోగా పూర్తి చేయాలి

- రూ.17.50 కోట్లతో నిర్మిస్తున్న ఆమనగల్లు 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రి పనులపై ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమీక్ష



ఆమనగల్లు, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో రూ.17.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 50 పడకల ఆధునిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) నిర్మాణ పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కల్వకుర్తి ఎమ్మె ల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం తన స్వగృహంలో ఈఈ రామ్మోహన్‌రెడ్డి, డీఈ కోటయ్య, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ నాగరాజు, హెచ్ఈఓ తిరుపతిరెడ్డి, పీఆర్వో దేవేందర్‌రెడ్డితో సమావేశమై నిర్మాణ పురోగతిపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆమనగల్లు పట్టణంతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఈ ఆస్పత్రి కీలకమని పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి నాణ్యతా లోపాలు లేకుండా ప్రతి పనిని ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని, అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తి చేసి భవనాన్ని వినియోగానికి సిద్ధం చేయాలని గుత్తేదారుకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆస్పత్రిలో ఆధునిక వైద్య పరికరాలు, లిఫ్ట్, మార్చురీ ఏర్పాటు, అన్ని మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు ఆస్పత్రి ఆవరణను ప్రధాన రహదారి స్థాయి కంటే ఎత్తుగా నిర్మించాలని సూచించారు. టైల్స్, ఫినిషింగ్ పనులు అత్యుత్తమ నాణ్యతతో పూర్తి చేసి నిర్ణీత గడువులోగా భవనాన్ని ప్రభుత్వానికి అప్పగించాలని ఆదేశించారు. అలాగే సీహెచ్‌సీకి అవసరమైన వైద్యులు, సిబ్బంది నియామకాల కోసం క్యాడర్ స్ట్రెంత్ అంశాన్ని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లేందుకు సంబంధిత అధికారులతో కలిసి ఎమ్మెల్యే బయలుదేరారు. ఈ సమావేశంలో కెఎన్ఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షుడు మెకానిక్ బాబా, ఆమనగల్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్, జూనియర్ అసిస్టెంట్ సాయి, సీహెచ్‌సీ సైట్ ఇన్‌చార్జి శంకర్‌తో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మంగళవారం,
జూలై 21, 2026
నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644



# బలహీన పడుతున్న బంధాలు



బంధాలు బలహీనమవుతున్నయి
కడు హీనమైన
నేరాలు,ఘోరాలు
చేయిస్తున్నయి
లిఅనుబంధాలు
పెనుమార్పులు పొందుతున్నయి
సంసార సాగరంలో
తుఫానులు రేపుతున్నయి
లిఅనుమానమే పెనుభూతమై
భార్యలను చంపిన భర్తలు
ప్రియుడి వల(పు)లో పడి
మగడిని
అంతం చేసే కాంతలు
లిశృంగార కాముకుని కోసం
బంగారం లాంటి
నిష్కపట ప్రేమికుడిని
శాంతి కాముకుడిని
అగాధంలోకి తోసి
మానవత్వానికి
స్త్రీ తత్వానికి
విఘాతం కలిగించే
కపట ప్రేయసి
లినచ్చిన భామతో
ప్రేమ పేరుతో
కామ వాంఛ తీర్చుకొని
అవాంఛనీయంగా
ప్రేయసిని హరించే ప్రియుడు
లివాత్సల్యంతో పెంచిన
మాతాపితలను
వార్ధక్యంలో వధించే
పనికిమాలిన సుతలు
సిగ్గు ఎగ్గు లేని సుతులు
లిఆస్తుల కోసం
ఆప్తులనే అంతమొందించే
అన్నదమ్ములు
అక్క చెల్లెల్లు
సెటిల్మెంట్ లే
తొలి ప్రక్రియలు
ఆ తర్వాతే
అంత్యక్రియలు
లిధాన్యాలను దంచే
రోకలి బండలే
తలకాయలను పిండి చేసే
గుది బండలవుతున్నయి
లికూరగాయలను కోసే చాకులే
సత్తువతో చురకత్తులై
పీకలు కోస్తున్నయి
మరణ శాసనాలు
రాస్తున్నయి
లిఅందంగా, ఆదర్శంగా
సుగందాలను విరజిల్లే
బంధాలు, అనుబంధాలు
నిర్బంధాలై
బలహీనపడి
దుర్గంధాలను
వెదజల్లుతున్నయి
జప్త. శ్రీనివాస్
ఉపాధ్యాయుడు
కనుకుల
స్వగ్రామం: ఎలిగేడు
( ఈ మధ్యకాలంలో స్త్రీ, పురుష బేధం లేకుండా హద్దు మీరుతున్న నేరాలను ఘోరాలను చూసి రాసిన కవిత)

# వెల్ఫేర్ బోర్డు స్కీం లను ప్రవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దు

- బోర్డు నిధులు కార్మికుల సంక్షేమానికే ఖర్చు చేయాలి.
- లేబర్ కోడ్స్ రద్దు చేయాలి:సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి సలీం



**నల్లగొండ,జులై 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**భవన నిర్మాణం వెల్ఫేర్ బోర్డు స్కీములను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇస్తూ తెచ్చిన జీవో నెంబర్ 12 ను ఉపసంహరించే వరకు పోరాటం కొనసాగించాలి. కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారానే సంక్షేమ పథకాలు అందించాలని, సహజ మరణానికి ఐదు లక్షలు ఇవ్వాలని, సిఎస్ సి హెల్త్ టెస్టులు ను రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి సలీం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
సోమవారం తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నలగొండ సుందరయ్య సెంట్రింగ్ ఆఫీస్ నుంచి డిసిఎల్ ఆఫీస్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా
ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం ప్రజా పాలన అందిస్తామని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు నిధులు దుర్వినియోగం అవుతున్న పట్టించుకోవడంలేదని విమర్శించారు.భవన నిర్మాణ కార్మికులకు బోర్డు ద్వారా అమలవుతున్న ప్రమాద మరణం, సహజ మరణం,శాశ్విత,పాక్షిక అంగవైకల్యం లాంటి స్కీములను జీవో నెంబర్ 12 ద్వారా ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇస్తూ 346.36 కోట్ల క్రెడిట్ యాక్సిస్ లైఫ్ ఇన్సూరెన్స్, ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వడం కార్మికులకు అన్యాయం చేయడమేనని ఇదేనా ప్రజాపాలన అని ప్రశ్నించారు.సిఎస్ సి హెల్త్ టెస్టులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.
లక్షలాది మంది నిర్మాణ రంగా కార్మికుల రెక్కల కష్టంతో పోగుపడ్డ సంపదను కార్మికుల సంక్షేమాన్ని కాకుండా ప్రవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు దోచిపెట్టడం అన్యాయమని విమర్శించారు.అవసరం ఉన్నా లేకున్నా ప్రతి కార్మికుడు పేరు మీద 2వేల 309 ప్రీమియం చెల్లిస్తూ పోతే బోర్డు నిధులు రోజురోజుకు తరుగుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే సిఎస్ సి హెల్త్ చెకప్ పేరుతో 750 కోట్లు కాజేశారని అన్నారు. కార్మికులకు మాత్రం ఇవ్వాల్సిన నష్టపరిహారాలు వేల సంఖ్యలో పెండింగ్ లో ఉన్నాయని వాటిని పరిష్కరించి తీరిక ప్రభుత్వానికి అధికారులకు లేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నిర్మాణరంగ కార్మికులందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలని, గడువు దాటిన 13 లక్షల కార్డులను రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిర్వీర్యం చేసే కుట్రలు అపకపోతే పెద్ద ఎత్తున కార్మిక వర్గాన్ని సమీకరించి పోరాడుతామని హెచ్చరించారు. ఈ ధర్నాను ఉద్దేశించి ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి చిన్న పాక లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వెల్ఫేర్ బోర్డు నిధులను కార్మికుల సంక్షేమం కోసం కాకుండా ఇన్సూరెన్స్ కంపెనీలకు వందల కోట్లు కట్టబెడుతున్నారు. రాష్ట్రంలో 28 లక్షల మంది వెల్ఫేర్ బోర్డులో పేర్లు నమోదు చేయించుకుంటే 15 లక్షల మంది కార్డులు మాత్రమే రెన్యువల్ చేసి మిగతా 13 లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల కు సంక్షేమ పథకాలు అందకుండా వారి కడుపులు కొడుతున్నారు. 55 సంవత్సరాలు వయసు పైబడిన భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ ఇవ్వాలని పిల్లల చదువులకు స్కాలర్ షిప్స్ ఇవ్వాలని పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని లేకపోతే హైదరాబాద్ ను ముట్టడిస్తామని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు కంచి కేశవులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దండంపల్లి సత్తయ్య, జిల్లా సహాయ కార్యదర్శి పెంజర్ల సైదులు, ఏర్పుల యాదయ్య,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అవుట రవీందర్,జిల్లా నాయకులు ఎస్ సైదాచారి,పోలే సత్యనారాయణ, బి దయానంద్ ,వరికుప్పల ముత్యాలు, వడ్డేపల్లి శంకర్,బి సైదులు, రేవెల్లి యాదయ్య, మంద రాజు, ఎస్.కె హుస్సేన్,గోవిందు వెంకన్న. శ్రీ సుందరయ్య సెంట్రింగ్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు. నోముల యాదయ్య. దేవరపల్లి వెంకట్ రెడ్డి.బచ్చలకూరి గురువయ్య.పాక లింగయ్య మన్నె శంకర్ దేవరపల్లి వెంకట్ రెడ్డి. తాపీ కార్మిక సంఘం నల్లగొండ పట్టణ కమిటీ నాయకులు. సాగర్ల మల్లయ్య జేరిపోతుల యాదయ్య తాలూకా ఎంకన్న. రాడ్ బెండింగ్ నాయకులు. తవ్వోజు నాగాచారి మేడిశెట్టి సతీష్. పెయింటింగ్ వర్కర్స్ పట్టణ నాయకులు. అధ్యక్ష కార్యదర్శులు. భీమనపల్లి శంకర్. పిడమర్తి శంకర్.లిఫ్ట్ వర్కర్స్ నాయకులు. గుంజ లక్ష్మణ్. వల్లపు సైదరాజు. తమ్మిశెట్టి కృష్ణ. సుంకర బోయిన రవి. కట్ట గోవర్ధన్. కట్ట శీను.తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పించిన ఆచారి

**ఆమనగల్లు, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి సోమవారం కోనాపూర్, గౌరారం, ఆకుతోటపల్లి, శెట్టిపల్లి, మాలేపల్లి గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని, పేరు, చిరునామా తదితర వివరాల్లో మార్పులు, చేర్పులు, తొలగింపులు ఉంటే నిర్ణీత గడువులోగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని సద్వినియోగం



చేసుకుని ప్రతి ఓటరు తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని ఆయన అన్నారు. అనంతరం బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ఎస్ఐఆర్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటరు నమోదు, వివరాల సవరణ, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియపై ప్రజలకు వివరించి, ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత బూత్ స్థాయి అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా జనరల్ సెక్రటరీ గోరటి నరసింహ, ఆమనగల్ మండల అధ్యక్షులు కేకే (ఎరవోలు) శ్రీనివాస్, కోనాపూర్ గ్రామ సర్పంచ్ బెల్లంకొండ శ్రీలత సైదులు, బీజేపీ జిల్లా నాయకులు ఆగటి మల్లేష్ ముదిరాజ్, మండల ప్రధాన కార్యదర్శి సురిగిరి జగన్ గౌడ్, మండల ఉపాధ్యక్షులు రమేష్ ముదిరాజ్, గౌరారం బూత్ అధ్యక్షులు గోరటి శివ, శెట్టిపల్లి బూత్ అధ్యక్షులు అర్థం ప్రసాద్, బూత్ అధ్యక్షులు యాదగిరిరావుతో పాటు భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎంపీఈఓలకు పనికి తగ్గ వేతనం ఇవ్వాలని డిమాండ్



**నందికొట్కూరు, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గత 12 సంవత్సరాలుగా వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న బహుళ ప్రయోజన వ్యవసాయ విస్తరణ అధికారులు (ఎంపీఈఓలు) తగిన వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎంపీఈఓ సంఘం నాయకులు మండిపడ్డారు. ప్రస్తుతం నెల జీతం రూ.12 వేలే, ఇన్సెంటివ్ రూ.3 వేలే ఇస్తున్నారని, ప్రభుత్వాలు మారినా తమ జీతభత్యాలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న నానుడి మాదిరిగానే ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.సంఘం అధ్యక్షుడు రాముడు, నాయకులు సలామ్ బాష, విష్ణు, సుధాకర్, వేణు బాయ్, జాన్సీలు ఆధ్వర్యంలో సోమవారం నందికొట్కూరు అగ్రికల్చర్ కార్యాలయం ఎదుట సహాయ నిరాకరణ ఉద్యమ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "నాలుగు నెలలుగా జీతాలు అందక కుటుంబాలు గడవడం లేదు. నెలకు కనీసం రూ.35 వేల జీతం తక్షణమే అమలు చేయాలి. శాశ్వత ఉద్యోగ భద్రత కల్పించాలి. నాన్‌శాంక్షన్ పోస్టులను శాంక్షన్ పోస్టులుగా మార్చాలి. ఎంప్లాయ్ హెల్త్ కార్డులు ఇవ్వాలి. విధి నిర్వహణలో మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా కల్పించాలి. మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ సెలవులు మంజూరు చేయాలి" అని డిమాండ్ చేశా రు.ఈ నెల 20 నుంచి 25 వరకు పెనౌన్‌కు ఉపక్రమించనున్నట్లు ప్రకటించిన వారు, గురువారం అన్ని మండలాల వ్యవసాయ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. మంత్రులను, ఉన్నతాధికారులను కలిసినా సమస్య పరిష్కారం కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రభుత్వం తక్షణమే స్పందించి మా న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి" అని కోరారు.ఈ కార్యక్రమంలో దాసు, అఖిల్, జాబి హుళ్ల, షహనాజ్,
అమృత తదితరులు
పాల్గొన్నారు.

# అనుమతులు లేని పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

**యాచారం, జులై 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :** ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో యూనిఫాంలు, పుస్తకాల దందా అరికట్టాలని యాచారం మండల ఎంఈవోకు వినతిపత్రం అందజేసిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ యువజన నేత ముత్యాల మనీష్ పటేల్ . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో యూనిఫాంలు, పుస్తకాల పేరుతో జరుగుతున్న అక్రమ దందాను అరికట్టాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో)ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ యువజన అధ్యక్షుడు ముత్యాల మనీష్ పటేల్ ఆధ్వర్యంలో సోమవారం ఎంఈవో కార్యాల



యంలో ఈ వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల పరిధిలో అనుమతులు లేకుండా నడుస్తున్న కొన్ని ప్రైవేట్ పాఠశాలల వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న విద్యాసంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.
అదేవిధంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపే విధంగా ఒకే దుకాణాల్లో యూనిఫాంలు, పుస్తకాలు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నాయని ఆరోపించారు. ఇటువంటి అక్రమాలను అరికట్టి, విద్యా వ్యవస్థలో పారదర్శకత తీసుకురావాలని ఎంఈవోను కోరారు. విద్యార్థుల హక్కులను పరిరక్షించడంతో పాటు తల్లిదండ్రులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకుంటామని ఎంఈవో హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు, యువజన విభాగం ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్



**నందికొట్కూరు, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్ చుక్ ఢిల్లీలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటు అని భారత విద్యార్థి ఫెడరేషన్ నందికొట్కూరు మండల కార్యదర్శి హరి వర్ధన్ మండిపడ్డారు. సోమవారం నందికొట్కూరు పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హరి వర్ధన్ మాట్లాడుతూ -- "నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి. గత 21 రోజులుగా సోనమ్ వాంగ్ చుక్ ఆమరణ దీక్ష చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం. ఆయన ఆరోగ్య పరిస్థితి తీవ్రంగా ప్రమాదకర స్థితిలో ఉంది. ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి ఆయన దీక్షను విరమింపజేయాలి" అని డిమాండ్ చేశారు.అతను మరింతగా, "బీజేపీ పాలనలో వరుసగా పేపర్ లీకేజీలు జరుగుతున్నాయి. ఇది విద్యార్థుల కలలను ఛిద్రం చేస్తోంది. అనేకమంది విద్యార్థులు ఆత్మహత్య లకు పాల్పడుతున్నారు. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ హత్యలే. విద్యార్థులు, యువత అంతా చైతన్యమై మంత్రి రాజీనామా చేసే వరకు పోరాటం ఆపకూడదు" అని పిలుపునిచ్చారు.ఎస్ఎఫ్ఐ నాయకులు హెచ్చరిస్తూ, "ప్రభుత్వం స్పందించకపోతే జిల్లా, రాష్ట్ర, దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులతో కలిసి కేంద్ర విద్యాశాఖ మంత్రి ఇంటి ముట్టడైన చేస్తాం" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, అర్షద్, అబ్దుల్లా, కార్తీక్, అశోక్, అప్రషు, ఇర్ఫాన్, ఇమ్రాన్, అర్జున్, ఆరిఫ్, సుమంతు,
బాలు, శరత్ తదితరులు
పాల్గొన్నారు.

# కల్వకుర్తిలో ఆధ్యాత్మిక శోభ విశ్వశాంతి మహాయాగంలో యాగ ప్రతిష్ఠ



**కల్వకుర్తి, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మానవాళి సుఖశాంతులతో జీవించాలని సంకల్పిస్తూ కల్వకుర్తిలో జరుగుతున్న విశ్వశాంతి మహాయాగం రెండవ రోజు ఉత్సవాలు సోమవారం భక్తిశ్రద్ధల మధ్య కొనసాగాయి. శ్రీకృష్ణ కాలచక్రం, విష్ణు పంచాయతనం, ఆయుత చండి, అతి రుద్ర హోమాలతో పాటు కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.ఉదయం వేళలో శివుని పూజా కార్యక్రమాలు నిర్వహించగా, గోపూజ మహోత్సవం సందర్భంగా గోవులకు పూజలు చేసి యాగశాల చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. వేదమంత్రాల ఘోషతో యాగశాల ప్రవేశం భక్తిశ్రద్ధలతో సాగింది. పండితులు వేదపఠనం చేస్తూ హోమాలను ముందుకు నడిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఆస్వాదించారు.ఈ సందర్భంగా శ్రీ శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి రుత్వికులను సమానంగా చేస్తూ పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ, "ఆగస్టు 3వ తేదీ వరకు జరిగే హోమాలు, పూజా కార్యక్రమాలలో భక్తులందరూ పాల్గొని దేవుని కృపకు పాత్రులు కావాలి" అని సూచించారు.ప్రతినిత్యం ఉదయం 6 గంటల నుండి రాత్రి వరకు ఆయుత చండి, అతి రుద్రం, ఋగ్వేద--యజుర్వేద--సామవేద--అధర్వణ వేద ఘోష హవనాలు, నవగ్రహ హోమం, నక్షత్రయాగం, శ్రీ సుదర్శన హవనం, సూర్య హోమం, సూర్య నమస్కారాలు, పాశుపతాస్త్ర హోమం, సుబ్రహ్మణ్య హోమం, పుత్రకామేష్టి హోమం, ధన్వంతరి హవనం, లక్ష్మీ గణపతి హోమం, మహాగణపతి హోమం, అష్టలక్ష్మి హోమం, లక్ష్మీనారాయణ హోమం, హనుమత్ హోమం, సరస్వతి హోమం వంటి కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.ఈ మహాయాగంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సెక్రటరీ సర్వీసెస్ జూలూరు రమేష్ బాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాచోటి శ్రీశైలం, యాగ నిర్వాహకులు,
పెద్ద సంఖ్యలో భక్తులు
పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి



**నందికొట్కూరు, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్‌సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి సిఫారసుల మేరకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను బాధితులకు టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి సోమవారం నందికొట్కూరు పట్టణంలోని తన స్వగృహంలో అందజేశారు.ఈ సందర్భంగా పాములపాడు మండలం వెంపెంట గ్రామానికి చెందిన బి. పాంఛీష్కు రూ.1,84,973, నందికొట్కూరు పట్టణానికి చెందిన షేక్ అబ్దుల్ రసీద్కు రూ.2,09,243, బండి ఆత్మకూరు మండలం జి.లింగాపురానికి చెందిన అంబటి సుంకిరెడ్డికు రూ.88,500 చెక్కులను అందజేశారు.మొత్తం రూ.4,82,716 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితులకు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి పంపిణీ చేశారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644
మంగళవారం, జూలై 21, 2026



# క్యూర్ పరిధిలో ఎల్ఐజీ స్కీమ్ ప్రారంభం దరఖాస్తుల స్వీకరణ



**హైదరాబాద్:** రాజధానిలో ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఉన్న కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలో ఇంది రమ్మ ఇళ్ల నిర్మాణ పథకానికి తెలంగాణ ప్రభు త్వం శ్రీకారం చుట్టింది. సచివాలయంలో ఈ పథకాన్ని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ , శ్రీధర్‌బాబు, అజారుద్దీన్ ప్రారంభించారు. పథకం విధివిధానాలు, అర్హతలు, దరఖాస్తుల ప్రక్రియపై ప్రకటన చేశారు. క్యూర్ పరిధిలోని నిరుపేదలకు ఇల్లు నిర్మించి ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీని వాసరెడ్డి స్పష్టం చేశారు.తమ ప్రభుత్వం స్థలం ఉన్నవారికి 4.50 లక్షల ఇళ్లు ఇచ్చామని, ఆగస్టు నాటికి 2 లక్షల పైగా ఇళ్లు పూర్తి కాబో తున్నాయని పొంగులేటి తెలిపారు. పేదలు నివసించే ప్రాంతంలోనే ఇల్లు ఇవ్వాలని నిర్ణయించామని, క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తున్నామని అన్నారు. గజం రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలు ఉన్న ప్రాంతంలో కూడా ఇళ్లు నిర్మించి ఇస్తున్నామని, 525 చదరపు అడుగులు ఉండేలా ప్లాట్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు."క్యూర్ పరిధిలో ఫ్లాట్ల కోసం రేపటి నుంచి ఆగస్టు 10 వరకు దరఖాస్తుల స్వీకరిస్తారు. మీసేవ, వాట్సప్, వెబ్‌సైట్ ద్వారా అప్లై చేసుకోవచ్చు. దరఖాస్తు ఫీజు రూ.100, ఈఎండీ రూ.10 వేలు ఉంటుంది. ఫ్లాటు రాని వారికి ఈఎండీ రూ.10 వేలు తిరిగి చెల్లిస్తారు. ఫ్లాటు పదేళ్ల పాటు అమ్మరాదని అద్దెకు ఇవ్వరాదని షరతు ఉంది. కుటుంబంలో ఒకరికి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. క్యూర్ పరిధిలో ఇల్లు, స్థలం లేని వారికి తొలివిడతలో ప్రాధాన్యం ఇస్తాం" - పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రిధనికులు నివసించే చోటే పేదలకు ఇళ్లు : బీఆర్ఎస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం వల్ల కట్టిన ఇళ్లు కూడా ఇవ్వలేకపోయారని, అప్పటి సర్కార్ నిర్మించిన ఇళ్లలో కొంత మందే నివసిస్తున్నారని మంత్రి తెలిపారు. కోర్ పరిధికి 30 కి.మీ. దూరంలో ఇళ్లు ఇచ్చిందని గుర్తు చేశారు. ఉపాధికి దూరంగా ఉండ దంతో పేదలకు ఇచ్చిన ఇళ్లలో నివసించదానకి ఇష్టపడట్లేదని, ధనికులు నివసించే చోటే పేదలకు ఇళ్లు ఇవ్వాలనేదే తమ సంకల్పమని వెల్లడించారు."రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా సంక్షేవ ం కొనసా గిస్తున్నాం. చివరి పేద వ్యక్తి వరకు ఇల్లు ఇవ్వాలనేదే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం. ఇల్లు నిర్మాణానికి ఇప్పటి వరకు రూ.5 లక్షలు ఇచ్చాం. భవిష్యత్తులో వందకు వంద శాతం ఇచ్చేలా ప్రయత్నిస్తాం. క్యూర్ ప్రాంతంలోనే ఇళ్ల కోసం 8.50 లక్షల అప్లిక్లేషన్లు వచ్చాయి. మాటలు చెప్పి తప్పించుకోము.చేతల్లో చేసి చూపిస్తాం. ఎకరం రూ.300 కోట్లు పలికినా పేదవాడి కల నేరవేర్చేందుకు ఇల్లు నిర్మించి ఇస్తాం. వివాదాలు లేని ప్రాంతాల్లో పేదవాడికి ఇల్లు నిర్మించి ఇస్తాం. నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని ఇల్లు నిర్మించి ఇస్తాం" - పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రిఇళ్ల నిర్మాణం నిరంతర ప్రక్రియ : లబ్ధిదారు 10 ఏళ్ల వరకు ఫ్లాట్ అమ్మకునే అవకాశం లేదన్న పొంగులేటి అవసరాల కోసం బ్యాంక్‌లో తనఖా పెట్టుకునేలా అవకాశం ఇస్తున్నామని తెలిపారు. కుటుంబానికి ఒకే ఫ్లాట్ కేటాయిస్తామని, అప్లికేషన్లు ఎక్కువ వస్తే డ్రా తీసి ఫ్లాట్లు కేటాయిస్తామన్నారు. ఆగస్టు 10 వరకు అప్లికేషన్లు పెట్టుకునేందుకు అవకాశముంటు ందని, మీసేవ, వాట్సప్, వైబ్‌సైట్‌లో అప్లికేషన్లు పెట్టుకోవాలని తెలిపారు. పారదర్శకంగా ఫ్లాట్లు కేటాయిస్తామని, ఫ్లాట్ల కేటాయింపులో పార్టీ, మతం, కులం ఏమీ అడగమని, తమ పార్టీకి ఓటు వేయాలని కూడా అడగమని స్పష్టం చేశారు. క్యూర్ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణం నిరంతర ప్రక్రియ అని వెల్లడించారు. జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరిలో లక్ష ఫ్లాట్లు నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. క్యూర్ పరిధిలో ఇల్లు, స్థలం లేని అల్పాదాయ వర్గాల కోసం ఈ పథకం తీసుకువస్తున్నారు. ప్రభుత్వ భూముల్లో హౌసింగ్ బోర్డు టవర్లను నిర్మిస్తున్నారు. క్యూర్ పరిధిలో తొలి విడతలో 16 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి సుమారు 500 ఇళ్ల చొప్పున ఇళ్ల నిర్మాణం చేపడతారు.

## బహదూర్‌గూడ భూములపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు




**హైదరాబాద్, జులై 20:** శంషాబాద్ మండలం, బహదూర్‌గూడ భూములపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. బహదూర్‌గూడ భూముల్లో ప్రభుత్వం ఎలాంటి తదుపరి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. సర్వే నంబర్లు 3, 4లో ఉన్న 28 ఎకరాలు తమవేనంటూ నలుగురు రైతులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం హైకోర్టు ఆ పిటిషన్‌పై విచారణ జరిపింది. సర్వే నంబర్లు 3, 4లో ఉన్న 28 ఎకరాల భూమిలో పిటిషనర్లు 30 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నారని పిటిషనర్ల తరఫు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు.ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపించారు. పిటిషనర్లుగా ఉన్న నలుగురు రైతుల పాస్ పుస్తకాల్లో అధికారుల సంతకాలు లేవని, కొన్నేళ్లుగా అక్కడ వ్యవసాయం చేస్తున్నారు కాబట్టే తమ భూమి అంటున్నారని ఆయన హైకోర్టుకు తెలిపారు. ఆ భూమి ప్రభుత్వ భూమి అని అన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న హైకోర్టు పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలతో ఏకీభవించింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు నలుగురు రైతుల భూముల్లో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవద్దంటూ ఆదేశాలు జారీ చేసింది.

## రేవంత్ రెడ్డి వచ్చిన తర్వాత 13వ స్థానానికి పడిపోయిన తెలంగాణ




**హైదరాబాద్,** రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక నీతి ఆయోగ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఫ్రెండ్లీనెస్ ఇండెక్స్ ర్యాంకింగ్-2026లో తెలంగాణ 13వ స్థానానికి పడిపో యిందని బీఆర్ఎస్ కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో కేటీఆర్ ఐటీ మంత్రిగా ఉన్నప్పుడు దేశంలోనే తెలంగాణ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో తొమ్మిదినరేళ్లలో ఏ రోజు కూడా 3వ స్థానం నుంచి కిందికి దిగలేదు. ఏనాడు కూడా 1, 2, 3వ స్థానాల్లో ఉండేదన్నారు.మన ప్లాన్‌ను, మన పాలసీని ఆంధ్రప్రదేశ్ ఎట్లాకాపీ కొట్టిందంటే ఆఖరి మనం రాసినవన్నీ కూడా ఆ రోజు కాపీ కొట్టేసింది. మనకు అంత బ్రహ్మాండమైన పాలసీ, ప్లాన్ ఉందన్నారు ఎమ్మెల్యే సంజయ్. అంత బ్రహ్మాండంగా నడిపించిన రాష్ట్రాన్ని ఇవాళ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చిన తర్వాత 13వ స్థానంలో నిలిచింది. దీని వల్ల వ్యాపారస్థులంతా పారిపోతున్నారు. కొత్తగా వ్యాపారేమీ రావడం లేదు. కొత్త ఇండస్ట్రీస్ ఏం రావు. నీతి ఆయోగ్ మొన్న కూడా మళ్లీ టీఎస్ ఐపాస్ అంత బ్రహ్మాండమైన సిస్టమ్ ఎక్కడా లేదని మళ్లీ పొగిడింది. టీఎస్ ఐపాస్ ఉన్నా కూడా మనం 13వ స్థానంలో ఉన్నామంటే ఒక్కసారి ఆలోచించాలన్నారు.దేశంలోని వ్యాపారవేత్తలే కాదు.. అందరు వ్యాపారవేత్తలు కూడా ఇంత బ్రహ్మాండమైన సింగిల్ విండో క్లియరెన్స్ పాలసీని మేమెక్కడా చూడలేదు. 15 రోజుల్లో మీకు అనుమతి వచ్చే పాలసీని చూడలేదని అందరూ ప్రశంసించారు.

## స్కైరూట్ విక్రమ్-1లో సిరిసిల్ల బ్రదర్స్ - రాకెట్ లాంచ్‌లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న అన్నదమ్ములు



**సిరిసిల్ల :** ఇటీవల 'విక్రమ్-1' రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపించిన 'స్కైరూట్ ఏరోస్పేస్' ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతి గడిస్తోంది. దేశంలోనే తొలి ప్రైవేట్ రాకెట్‌ను ప్రయోగించిన సంస్థగానూ చరిత్ర సృష్టించింది. హైదరాబాద్? కేంద్ర ంగా పని చేస్తున్న ఈ స్టార్టప్? రూపొందించిన మొదటి ఆర్బిటాల్ ప్రయోగ వాహకమైన 'విక్రమ్-1'ను శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం(షార్) నుంచి శనివారం విజయవంతంగా ప్రయోగించారు.ఈ అంకుర సంస్థ? తొలి ప్రయత్నంలోనే భూ కక్ష్యలోకి శాటిలైట్లను ప్రవేశపెట్టడం వల్ల భారత ప్రైవేటు అంతరిక్షరంగ సామర్థ్యాన్ని ప్రపంచానికి తెలియజేసినట్లైంది. అయితే, ఈ విజయంలో భాగస్వాములైన రాజన్న సిరిసిల్ల జిల్లా యువకులు ఇప్పుడు ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారు.అంతర్జాతీయ స్థాయిలో పేరుపొందుతూ : ఈ ప్రయోగంతో సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించిన స్కైరూట్? స్టార్టప్?లో సిరిసిల్ల పట్టణానికి చెందిన అడప సంతోష్, అడప కిరణ్, బొమ్మదేవి నాగరాజు కీలక పాత్ర పోషించారు. సామాన్య కుటుంబ నేపథ్యాల నుంచి వచ్చి అంతర్జాతీయ స్థాయికి చేరుకునేలా అంతరిక్ష మిషన్?లో పాలుపంచుకొని యువతకు స్ఫూర్తి కలిగిస్తున్నారు. సాంకేతిక నైపుణ్యంతో పాటు పట్టుదల కృషి ఉంటే ఏదైనా సాధించగలమని ఈ యువ ఇంజినీర్లు చాటిచెబుతున్నారు.ఈ ముగ్గురు అన్నదమ్ములే : ఒకే పట్టణానికి చెందిన ఈ యువకుల్లో ఒకే ఇంటి నుంచి వచ్చిన వారూ ఉన్నారు. అడప సంతోష్, కిరణ్?లు సొంత అన్నదమ్ములు. వీరు పదో తరగతి దాకా సిరిసిల్ల పట్టణంలోని సర్కారు బడిలోనే చదివారు. నిజామాబాద్, హైదరాబాద్?లో పాలిటెక్నిక్ డిప్లొమాలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ఈఈఈ) పూర్తి చేశారు. వీరి సమీప బంధువైన కామారెడ్డి జిల్లా కు చెందిన నాగరాజు బీటెక్‌లో సీఎస్ఈ చేశారు. ఈయనకు సంతోష్, కిరణ్‌లు వరుసకు అన్నదమ్ములు అవుతారు.?కీలక విధులు నిర్వర్తిస్తూ : నిజామాబాద్?లోని పాలిటెక్నిక్ కళాశాలలో అడప సంతోష్‌కుమార్ ఈఈఈ పూర్తి చేశారు. అనంతరం ఓ ప్రైవేట్ కాలేజీలో బీటెక్ చదివారు. ఆ తర్వాత భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో)లో మూడేళ్ల పాటు ఎలక్ట్రికల్ గ్రౌండ్ చెక్ అవుట్ విభాగంలో పనిచేశారు. స్కైరూట్ స్టార్టప్‌లో 2024 నుంచి ఏవియానిక్స్ గ్రౌండ్ చెక్ అవుట్ ఇంటిగ్రేషన్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. రాకెట్ ప్రయోగంలో కీలకమైన ఏవియానిక్స్ సిస్టమ్ సమీకరణ, టెస్టింగ్, గ్రౌండ్ చెక్ అవుట్ ప్రక్రియలను సమన్వయం చేసే బాధ్యతలను పర్యవేక్షించారు.టీం లీడర్?గా బాధ్యతలు చ : అడప కిరణ్‌కుమార్ డిప్లొమా పూర్తి చేసిన తర్వాత భారత రక్షణ అభివృద్ధి పరిశోధనా సంస్థలో పది సంవత్సరాల పాటు పలు విభాగాల్లో విధులు నిర్వహించారు. అనంతరం అయిదున్నర సంవత్సరాలుగా స్కైరూట్? ఏరోస్పేస్‌లో స్పేస్ ఏవియానిక్స్ విభాగం (సీఏడీ)లో టీం లీడర్?గా బాధ్యతలు చేపట్టారు. ఇందులో భాగంగా రాకెట్ డిజైన్ రూపొంది ంచడం, ఇంజినీరింగ్ పనుల్లో పలు కీలక బాధ్యతలను నిర్వహించారు.ఎలక్ట్రికల్ ఇంటిగ్రేషన్ ఇంజినీర్‌గా : కిరణ్, సంతోష్?ల బంధువు బొమ్మదేవి నాగరాజు కూడా బీటెక్‌లో సీఎస్ఈ పూర్తి చేశారు. ఇంటర్న్‌షిప్‌లో భాగంగా స్కైరూట్‌లో చేరారు. తర్వాత ఇదే సంస్థలోనే ఎలక్ట్రికల్ ఇంటిగ్రేషన్ ఇంజినీర్‌గా విధుల్లోకి చేరారు. వీరు రాకెట్ ఎలక్ట్రిసిటీ సిస్టమ్స్ ఈక్వేషన్, కనెక్టింగ్ వంటి ముఖ్యమైన బాధ్యతలను పర్యవేక్షించారు.

# ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బ్యాంకులో 12 కోట్ల కుంభకోణం




**శంషాబాద్:** ఇటీవల కాలంలో అక్రమాలకు అడ్డుఅదుపు లేకుండా పోతోంది. ఆఫీసర్లు, వార్డు బాయ్‌లు అనే తేడా లేకుండా దొరికిన కాడికి దోచుకుంట ున్నారు. తాజాగా రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిన్న గోల్కొండ ప్రాథ మిక వ్యవసాయ సహకార సంఘం బ్యాంక్‌లో 12 కోట్ల కుంభకోణం వెలుగులోకి వచ్చింది. అమాయక ప్రజల డబ్బులు దోచుకోవటంతో వారంతా ఆందోళనకు దిగారు.డిపాజిటర్ల డబ్బు ను అక్రమంగా మళ్లింపు : బ్యాంకు సీఈవో బల్లమోని యాదయ్య, క్లర్క్ సురేందర్ యాదవ్ కుమ్మక్కై డిపాజిటర్ల డబ్బును అక్రమంగా మళ్లిం చినట్లు ఆరోపణలు చేస్తున్నారు. 2008 నుంచి 2011 వరకు బ్యాంకులో 12 కోట్ల కుంభ కోణం జరిగినట్లు డిపాజిటర్లు వెల్లడించారు. విషయం బయటకు రావడంతో డిపాజిటర్లు ఆందోళనకు దిగారు. తమ డబ్బు కోసం బ్యాంకు ముందు పెద్ద సంఖ్యలో చేరి నినాదాలు చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగంలోకి దిగి భద్రతను పెంచారు. డిపాజిటర్ల డిమాండ్ : కుంభకోణంలో బాధ్యు లైన సీఈవో బల్లమోని యాదయ్య క్లర్క్ సురేం దర్‌లపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని తమ డిపాజిట్లు తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేశారు. వారి కష్టార్జితం బ్యాంకులో వేస్తే ఇలా మోసం చేశారని బాధ్యులను అరెస్టు చేసి డబ్బులు రికవరీ చేయాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.' 'పది గ్రామాలకు ఈ బ్యాంక్ అనుకూలంగా ఉంది. ఈ గ్రామాల రైతుల ందరూ దగ్గరదగ్గరగా 20, 30 ఏండ్ల నుంచి ఇందులో పైసలు దాచుకున్నారు. దాదాపు 11 కోట్ల పైన ఈ కుంభకోణం జరిగింది. ఆ పైసలన్ని డిపాజిటర్లు మోసపోయారు. ఈ కుంభకోణాన్ని ఆఫీసర్లు గానీ రాజకీయ నాయకులు గానీ స్పందించి ఆదుకోవాలి. భవిష్యత్తులో కూడా ఇలాంటివి జరగకుండా బాధ్యత తీసుకోవాలని మనవి చేస్తున్నాం" - బాధితుడుబాధ్యులపై చర్యలు తప్పనిసరి : బ్యాంక్ చిన్న గోల్కొండ సహకార సంఘం బ్యాంక్ కుంభకోణం విషయంలో నూతన సీఈవో యాదగిరి రెడ్డి స్పందించారు. సహకార సంఘం బ్యాంకులో డిపాజిట్లకు సంబంధించిన అక్రమాలు జరిగినట్లు గుర్తించిన వెంటనే ఈ విషయంపై జిల్లా అధికారి ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. కుంభకోణంపై పూర్తి నివేదిక వచ్చిన తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటామని యాదగిరిరెడ్డి వివరించారు. బ్యాంకు పారదర్శకత కోసం అన్ని రికార్డులను పరిశీలిస్తున్నామని డిపాజిట్ దారులకు ఎలాంటి నష్టం జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. డిపాజిట్ దారులు ఆందోళన చెందవద్దని బ్యాంక్ కార్యకలాపాలు యధావిధిగా కొనసాగుతాయని ఆయన తెలిపారు. సమాచారం ఇవ్వటం జరిగింది. దీనిపైన జిల్లా సహకార అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఏదేమైనా దర్యాప్తులో వచ్చే సమాచారం ఆధారంగానే చర్యలు తీసుకుంటాం. డిపాజిట్ దారులకు ఎలాంటి నష్టం జరగకుండా చూస్తాం.

## రిపోర్టులో అన్ని విషయాలూ తెలుస్తాయి'.. ఉదయ్ కృష్ణారెడ్డి హెల్త్‌పై డాక్టర్



**హైదరాబాద్, జులై 20:** మహిళా ట్రైనీ ఐపీఎస్‌ను లైంగికంగా వేధించారన్న ఆరోపణలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఉదయ్ ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్ రవిశంకర్ రెడ్డి వివరించారు. (సోమవారం) ఉదయం 9:30 గంటల ప్రాంతంలో ఉదయ్ కృష్ణారెడ్డిని ఆస్పత్రికి తీసుకొచ్చారని.. ఆ సమయంలో ఆయన స్పృహలో లేనట్లు తెలిపారు. ఆస్పత్రికి తీసుకొచ్చిన వెంటనే కడుపును శుభ్రం చేశామని, అయితే కడుపులో ఏమీ కనిపించ లేదని డాక్టర్ వెల్లడించారు.కృష్ణారెడ్డి ఏమీ తీసుకోలేదనే అనుకుంటున్నామ ని. రిపోర్టులో అన్ని విషయాలు వివరంగా తెలుస్తాయని డాక్టర్ చెప్పారు. ఆయన ఏదైనా విష పదార్థం తీసుకున్నారేమో అనే అనుమానంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకొచ్చారన్నారు. బ్లడ్ సేకరించామని.. రిపోర్ట్స్ వచ్చాక ఆయన ఏం తీసుకున్నారనేది తెలుస్తుందన్నారు. వైటల్స్‌తో పాటు బీపీ పల్స్ అన్నీ స్టేబుల్‌గా ఉన్నట్లు చెప్పారు. ఉదయ్ కృష్ణారెడ్డి స్పృహలోకి రావడానికి మరో 24 గంటల సమయం పడుతుందన్నారు. కృష్ణారెడ్డి బెడ్ పక్కన ఆల్కహాల్ బాటిల్‌తో పాటు శానిటైజర్ బాటిల్ పడి ఉందని వాళ్ల సోదరుడు చెప్పారని డాక్టర్ రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు.ఉదయం మా అన్నయ్య అపస్మారక స్థితిలో ఉన్నారు. వెంటనే ఆసుపత్రికి తీసుకుని వచ్చాం. ప్రస్తుతం ట్రీట్మెంట్ కొనసాగుతోంది. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందనే డాక్టర్లు చెబుతున్నారు. ఏం తీసుకున్నారన్నది తెలియాల్సి ఉంది. బ్లడ్ రిపోర్ట్స్ వచ్చాక ఆయన ఏం తీసుకున్నారో అనేదానిపై క్లారిటీ వస్తుంది.

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి సస్పెన్షన్



**హైదరాబాద్, జులై 20:** లైంగిక ఆరోపణల నేపథ్యంలో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిపై హైదరాబాద్ నేషనల్ అకాడమీ చర్యలు తీసుకుంది. కృష్ణారెడ్డిని తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. నేషనల్ పోలీస్ అకాడమీ ప్రివిలేజ్ కమిటీ నిర్ణయం మేరకు ఉదయ్ కృష్ణా రెడ్డిని ఎన్‌పీఏ నుంచి అధికారులు పంపించేశారు. ఉదయ్ కృష్ణారెడ్డి ప్రవర్తన గురించి మొదట ఎన్‌పీఏ అధికారులకు మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదు చేశారు.సీసీటీవీ కెమెరాల ఆధారాలతో పాటు అన్ని ఎవిడెన్స్ సేకరించాక ఉదయ్ కృష్ణారెడ్డిపై ఆరోపణలు నిజమేనని ప్రివిలేజ్ కమిటీ నిర్ధారించింది. దీంతో తక్షణమే ఎన్‌పీఏ నుంచి సస్పెండ్ చేస్తూ ప్రివిలేజ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. సర్వీస్‌లో జాయినింగ్‌కు సంబంధించి డీవోపీటీ దే తుది నిర్ణయం అని నేషనల్ పోలీస్ అకాడమీ అధికారులు చెబుతున్నారు.

# దండేపల్లి మండలంలో ఎంపీ గడ్డం వంశీకృష్ణ పర్యటన అడ్డుకోవడాన్ని దళిత సంఘాల ఖండన

**మంచిర్యాల జిల్లా, జూలై 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ అధికారిక పర్యటనను అడ్డుకునే ప్రయత్నం, స్వాగత ఫ్లెక్సీలను చించివేయడం వంటి ఘటనలను దండేపల్లి మండల దళిత సంఘాలు తీవ్రంగా ఖండించాయి.ఈ నెల 18వ తేదీ శనివారం గూడెం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పాఠశాల బ్యాగుల పంపిణీ కార్యక్రమానికి ఎంపీ వంశీకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా గూడెం గ్రామ సమీపంలో కొందరు వ్యక్తులు గుంపులుగా చేరి ఎంపీ కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో పాటు నినాదాలు చేస్తూ స్వాగత ఫ్లెక్సీలను చించివేయడం హేయమైన




చర్య అని దళిత సంఘాల నాయకులు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలు ఎన్నుకున్న పార్లమెంట్ సభ్యునికి తన పరిధిలోని ప్రతి గ్రామాన్ని సందర్శించి ప్రజల సమస్యలను తెలుసుకునే హక్కు ఉందని వారు స్పష్టం చేశారు. విద్యార్థులకు సేవాకార్యక్రమంగా బ్యాగుల పంపిణీ చేయడానికి వచ్చిన ఎంపీని అడ్డుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ ఘటన వెనుక ఉన్నవారిపై తగిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాలు డిమాండ్ చేస్తూ, "భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే జిల్లా, రాష్ట్ర స్థాయిలో దళిత సంఘాలు ఐక్యంగా ఉద్యమిస్తాయి" అని హెచ్చరించాయి.

ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు "దళితుల ఐక్యత వర్ధిల్లాలి, అంబేద్కర్ ఆలోచనా విధానం వర్ధిల్లాలి, జై భీమ్" అంటూ నినాదాలు చేశారు.

# హెల్తీ- వెల్తీ- హ్యాపీ ఆంధ్రప్రదేశ్' లక్ష్యంగా ముందుకు



**తిరుపతి/అమరావతి, జులై 20:** విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. (సోమవారం) తిరుప తిలో జరిగిన షైనింగ్ స్టార్స్ 2026 కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో విద్యా వ్యవస్థను దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ కిట్ల ద్వారా ప్రతి విద్యార్థికీ నాణ్యమైన విద్యా సామగ్రిని అందిస్తున్నామని చెప్పారు. మధ్యాహ్న భోజనంలో పోషకాహారాన్ని పెంచి విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి తెలిపారు. గతంలో నిలిచిపోయిన ఇంటర్మీడి యట్ విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకాన్ని పునరుద్ధరించామన్నారు. సూపర్ సిక్స్ హామీలో భాగంగా 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించి ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామని చెప్పారు. 'హెల్తీ- వెల్తీ- హ్యాపీ ఆంధ్రప్రదేశ్' లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోం దని వెల్లడించారు. ఈ నెల 24న జరిగే పేరెంట్-టీచర్ సమావేశాలను తల్లిదండ్రులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నేడు విద్యార్థులపై పెట్టుబడి పెడితేనే రేపటి అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రతిభను ప్రోత్సహించడమే 'షైనింగ్ స్టార్స్--2026' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని మంత్రి స్పష్టం చేశారు. విద్య ద్వారా తిరుపతి జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. తిరుపతిని ఆధ్యాత్మికంగా, క్రీడలపరంగా, పారి శ్రామికంగా అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తా మన్నారు. తిరుపతిలో అంతర్జాతీయ క్రికెట్ నిర్మిస్తామని అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.

# 'లుక్ ఆఫ్ ది ఫ్యూచర్' - జెట్ స్పీడ్‌లో అమరావతి 'ఐకానిక్ టవర్స్' పనులు

**అమరావతి:** గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి చెక్ పెట్టి బాలా రిష్టాలను దాటుకుని పునాది దశల సవాళ్లను జయించి నవ్యాంధ్ర కలలకు నిలువెత్తు రూపంగా అమరావతి శాశ్వత సచివాలయం శరవేగంగా ఆవిష్కృతమవుతోం ది. దేశంలోనే తొలిసారిగా డయాగ్రిడ్ టెక్నాలజీతో నిర్మితమ వుతున్న సచివాలయం, విభాగాధిప తుల ఐకా నిక్ టవర్లు ఇప్పుడు నేలను వీడి ఆకాశం వైపు జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తున్నాయి. రాష్ట్ర పరిపా లనకు శాశ్వత కేంద్ర బిందువుగా నిలవనున్న ఈ మహా నిర్మాణాలు అమరావతి రూపురే ఖలను రోజురో జుకీ మార్చేస్తూ 'లుక్ ఆఫ్ ది ఫ్యూచర్'ను కళ్లముందు ఆవిష్కరిస్తున్నాయి. సంప్రదాయ భవనాల్లా నిలువు స్తంభాలు, అడ్డ బీమ్స్‌పై ఆధారపడే నిర్మాణం కాదు ఇది. దేశంలోనే తొలిసారిగా డయాగ్రిడ్ టెక్నాలజీతో అమరావతి సచివాలయం, హెచ్‌వోడీ టవర్లు రూపుదిద్దుకు ంటున్నాయి. త్రిభుజాకార ఉక్కు నిర్మాణం, మధ్యలో పటిష్ఠమైన కోర్?వాల్‌తో ఈ ఐకానిక్ టవర్లు ప్రపంచస్థాయి ఇంజినీరింగ్‌కు ప్రతీకగా



నిలుస్తున్నాయి. డయాగ్రిడ్ నిర్మాణంలో భవనంపై పడే బరువు ఒకే చోట కాకుండా మొత్తం నిర్మాణానికి సమానంగా పంపిణీ అవుతుంది. దీంతో భూకంపాలు, పెనుతుపాన్ల వంటి ప్రకృతి విపత్తులను కూడా ఈ టవర్లు మరింత సమర్థంగా తట్టుకునేలా రూపకల్పన చేశారు. లోపల నిలువు స్తంభాలు లేకపోవడంతో మొత్తం ఫ్లోర్ స్పేస్‌ను కార్యాలయాలకే వినియోగించుకునే అవకాశం ఉంటుంది. ఉద్యోగులకు విశాలమైన పని వాతావరణంతో పాటు స్టీల్ వినియోగం తగ్గడం వల్ల నిర్మాణం మరింత సమర్థవంతంగా మారుతోంది. 26  శ 23 మీటర్ల విస్తీర్ణంలో నిర్మిస్తున్న కోర్?వాల్‌లో లిఫ్ట్?లు, మరుగుదొడ్లు, పాంట్రీ, ఫైర్ సేఫ్టీ వ్యవస్థలు అన్నీ ఒకేచోట ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో అంతస్తు 50 శ 50 మీటర్ల విస్తీర్ణంలో ఉండి ఆధునిక పరిపాలనకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. జీఏడీ టవర్‌లో 16, మిగిలిన 4 టవర్లలో 15 చొప్పున లిఫ్ట్?లు ఏర్పాటు చేస్తున్నారు. ఒకే షాఫ్ట్‌లో 2 కాప్సూల్స్ తిరిగే డ్యూయల్ కాప్సూల్ వ్యవస్థతో పాటు అవి ఢీ కొనకుండా అత్యాధునిక యాంటీ-కొలిజన్ టెక్నాలజీని అమర్చుతున్నా రు. ఐదు ప్రధాన టవర్లతో పాటు 9 ఎమినిటీస్ బ్లాక్స్ నిర్మిస్తున్నారు. ప్రజాఫిర్యాదుల హాల్, సమావేశ మందిరాలు, బ్యాంకులు, పోస్టాఫీస్, లైబ్రరీ, జిమ్, స్విమ్మింగ్ పూల్, చైల్డ్‌కేర్ సెంటర్, టెర్రస్ గార్డెన్స్‌తో ఇది సమగ్ర పరిపాలనా సముదాయంగా రూపుదిద్దుకుంటో ంది. 40 నుంచి 50 అంతస్తుల టవర్లు కావడంతో పునాదుల నిర్మాణమే అతిపెద్ద సవాల్?గా మారింది. వర్షాలు, నీటి సమస్యల మధ్య దాదాపు రెండేళ్లు ఫౌండేషన్ పనులకే పట్టినా ఇప్పుడు ఆ దశ దాటి భవనాలు మూడంతస్తుల ఎత్తుకు చేరుకుని శరవేగంగా ముందుకు సాగుతున్నాయి. విదేశీ జంపింగ్ ఫార్మ్‌వర్క్ టెక్నాలజీతో షట్టరింగ్‌ను నిమిషాల వ్యవధిలోనే పైఅంతస్తుకు తరలిస్తున్నారు. దీంతో రోజుల వ్యవధిలోనే ఒక్కో అంతస్తు పూర్తవుతూ నిర్మాణ వేగం 3 రెట్లు పెరిగింది. డైమండ్ ఆకారంలో పైకి ఎదిగే డయాగ్రిడ్ నిర్మాణం ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది. సివిల్ పనులు శరవేగంగా సాగుతుండగా ఇదే వేగం కొనసాగితే అనుకున్న సమయంలోగా ఐకానిక్ టవర్ల ప్రధాన నిర్మాణం పూర్తికానుంది. అమరావతి పరిపాలనా గుండెకాయగా నిలవబోయే ఈ నిర్మాణాలు నవ్యాంధ్ర ఆశయాలకు శాశ్వత చిరునామాగా అవతరించనున్నాయి.

# మధురమైన యాత్ర - 9 టన్నుల లడ్డూల రథంపై కొలువుదీరిన జగన్నాథుడు

**విజయవాడ:** పూరీ జగన్నాథుడి రథయాత్ర ఆదివారం సాయంత్రం అంగరంగ వైభవంగా జరిగింది. భజనలు, హరినామ సంకీర్తనల నడుమ సాగిన ఈ కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సాధారణంగా రథం అనగానే కలపతోనో, ఇత్తడితోనో తయారు చేసినవి చూస్తుంటాం. కానీ జగన్నాథుడి కోసం ఏకంగా తొమ్మిది టన్నుల లడ్డూలతో ఓ బ్రహ్మాండమైన రథాన్నే తీర్చిదిద్దారు. భక్తికి తీపితనం తోడైన ఈ కనులవిందైన రథయాత్ర విజయవాడ సమీప ంలోని సీతానగరంలో అత్యంత వైభవంగా జరిగింది. లడ్డూల రథంపై కొలువుదీరిన స్వామివారిని కనులారా వీక్షించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. పోటీపడి మరీ రథాన్ని



లాగుతూ భక్తిపారవశ్యంలో మునిగితేలారు. ప్రత్యేక పూజలు: 9 వేల కిలోల లడ్డూతో ప్రత్యేక ంగా అలంకరించిన రథాన్ని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ ఇస్కాన్ ప్రతిని ధులతో కలిసి ప్రారంభిం చారు. ముందుగా జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రాదేవిని దర్శించుకొని కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఉమా మాట్లాడుతూ ఇస్కాన్ సంస్థ ఏటా నిర్వహించే జగన్నాథుడి రథయాత్ర భారతీయ సంస్కృతి, సనాతన ధర్మపరిరక్షణకు ప్రతీకగా నిలుస్తోంద న్నారు. భక్తుల కోలాహలం: గద్దె అనురాధ మాట్లాడుతూ స్వామివారి కృపాకటాక్షాల ప్రతి కుటుంబంపై ఉండాలని ఆకాంక్షించారు. ఇస్కాన్ ప్రతినిధులు భగవద్గీత గ్రంథాలు, స్వామివారి చిత్రపటాలను భక్తులకు పంపిణీ చేశారు. ఈ వేడుకలో బీజేపీ నాయకుడు పాతూరి నాగభూషణం, గజల్ శ్రీనివాస్, విజయకృష్ణా సూపర్‌బజార్ ఛైర్మన్ వెలగా సురేష్, ఇస్కాన్ ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగన్నాథుడి రథయాత్రలో అడుగులో అడుగు వేయడం ప్రతి భక్తుడికి లభించే దైవానుగ్రహమని ఇస్కాన్ ప్రతినిధి రామ్ మురారి దాస్ తెలిపారు. 'ప్రపంచంలో ఎన్నో విశేషమైన రథయాత్రలు జరిగాయి, కానీ ఇలా లడ్డూతో రథయాత్ర జరగడం ఇదే మొదటిసారి. 9 వేల కిలోల లడ్డూలతో ఈ యాత్ర జరిగింది. ప్రతీ సంవత్సరం వినాయకచవితి నిర్వహించినట్లు జగన్నాథ రథయాత్ర చేస్తాం. బెజవాడలో వాడ వాడకు జగన్నాథుని ఆశీర్వాదాలు తీసుకెళ్తాం

# మంత్రి నిమ్మల సీరియస్.. కాంట్రాక్టర్, అధికారిపై కేసు నమోదు



**అంబేద్కర్ కోనసీమ జిల్లా, జులై 20:** జిల్లాలోని ముక్కామల నడిపూడి మధ్య నేదునూరు పెదపాలెం వద్ద ప్రధాన పంట కాలువపై రిటర్నింగ్ వాల్ నిర్మించిన కాంట్రాక్టర్, ఆర్ అండ్ బి అధికారిపై అయినవిల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయ్యింది. ఈనెల 17న పంట కాలువలను మంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలిం చారు. ఈ సందర్భంగా పంట కాలువ ద్వారా సాగునీరు సరఫరా కాకుండా అడ్డుగా రిటర్నింగ్ వాల్ నిర్మించారంటూ మంత్రికి రైతులు ఫిర్యాదు చేశారు. దీనిపై నిమ్మల సీరియస్‌గా స్పందించారు. సంబంధిత కాంట్రా క్టర్, అధికారులపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని జలవనరుల శాఖ అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. నిమ్మల ఆదే శాలతో కొత్తపేట ఇరిగేషన్ ఏఈ సాయి పవ న్ అయినవిల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

# ఏపీలో యువతకు టూరిజం గైడ్స్‌గా ఉపాధి అవకాశాలు



**జైపూర్, జులై 20:** ఆంధ్రప్రదేశ్‌లోని యువతకు టూరిజం గైడ్స్‌గా ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ పర్యటన కొనసాగుతుంది. సోమవారం టూరిజం గైడ్స్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ నరేంద్ర సింగ్ రాథోడ్‌తో మంత్రి దుర్గేష్ సమావేశమ య్యారు. టూరిజం గైడ్స్ ఫెడరేషన్ సహకారం తో ఏపీ యువతకు టూర్ గైడ్స్‌గా ట్రైనింగ్ ఇవ్వాలని ఈ సందర్భంగా రాథోడ్‌ను ఆయన కోరారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించాలంటూ రాథోడ్‌ను కందుల దుర్గేష్ ఆహ్వానించారు. స్థానిక యువతకు శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి కల్పించేందుకు త్వరలో టూరిజం గైడ్స్ ఫెడరేషన్ ప్రతినిధులు ఆంధ్రప్రదేశ్‌కు వస్తారని తెలిపారు. మరికొన్ని రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లోని పర్యాటక ప్రాంతాల్లో ఏఐ డిజిటల్ గైడ్స్‌తో పాటు ప్రొఫెషనల్ టూర్ గైడ్స్ అందుబాటులోకి వస్తారని మంత్రి దుర్గేష్ వివరించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పనే కూటమి ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం నేపథ్యంలో పర్యాటక రంగంలోని 20 కీలక విభాగాలలో 10 వేల మంది యువతకు శిక్షణ అందించాలని ఏపీ పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్ భావిస్తున్నారు.

# పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల తరహాలో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు

**అమరావతి:** దీపం-2.0 లబ్దిదారులకు నిర్ధారిత తేదీల్లో నగదు జమ అవుతుందని ముఖ్యమంత్రి చంద్ర బాబు వెల్లడించారు. ఆర్టీజీఎస్ కేంద్ర ంలో వివిధ శాఖలపై సీఎం సమీక్ష నిర్వహి ంచారు. సమీక్షలో భాగంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయా ల్లో ఏర్పాటు చేయబోతున్న రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ప్రస్తావన చర్చకు వచ్చింది. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తోంటే, కొందరు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులను ప్రైవేటీకరణ చేస్తున్నారంటూ దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. డాక్యుమెంట్ రైటర్లు ఉపాధికి మార్గాలు చూపెడతామని వెల్లడించా రు. ప్రజలకు మెరుగైన రిజిస్ట్రేషన్ సేవలంది ంచేం దుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని సీఎం చంద్రబాబు చెప్పారు. రిజిస్ట్రేషన్ సేవలను మరింత సులభతరం చేసేలా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రం-శాఖలను ఏర్పాటు చేస్తున్నామని, ఇది ప్రైవేటీకరణ ఎంత మాత్రమూ కాదన్నారు. పాస్ పోర్టు సేవా



కేంద్రాల తరహాలోనే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు పని చేస్తాయన్నారు. పాస్ పోర్టు సేవా కేంద్రాల ఏర్పాటుతో పాస్ పోర్టు ప్రాసెసింగ్ సులభతరమైందని గుర్తు చేశారు. ఇదే తరహాలో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ద్వారా రిజిస్ట్రేషన్ సేవలను సులభ ంగా పొందవచ్చని సూచించారు. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ద్వారా సేవలు సులభతరంగా పొందడంతో పాటు, మధ్యవర్తుల ప్రమేయం తగ్గుతుందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. మధ్యవర్తుల ప్రమేయం తగ్గుతుందని ప్రజలకు సేవలందిం చేలా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తుంటే, కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు వాస్తవాలు వివరించే బాధ్యతను అధికారులు తీసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల వల్ల కలిగే లాభాలను వివరించా లన్నారు. డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డాక్యుమెంట్ రైటర్ల ఉపాధికి ఇబ్బంది లేని విధంగా ఆదాయ మార్గాలు చూపెడతామని సీఎం తెలిపారు.

# తల్లికి వందనం అలర్ట్.. ఇలాంటి పనులు అస్సలు చేయొద్దు.

**అమరావతి:** తల్లికి వందనం పథకం .. పిల్లల చదువుకు ఆర్థిక సమస్యలు అడ్డు కాకూడదనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమం. జూలై 22వ తేదీన తల్లికి వందనం పథకం నిధుల విడుదలకు ఏపీ ప్రభుత్వం సిద్ధమైంది. సుమారు 67 లక్షల మంది విద్యార్థులకు ఈ పథకం ద్వారా రూ.13 వేలు ఆర్థిక సాయం అందించనున్నారు. అయితే తల్లికి వందనం పథకం నిధుల విడుదల వేళ.. ఈ అవకాశాన్ని సొమ్ము చేసుకునేందుకు సైబర్ నేరగాళ్లు వల విసురుతున్నారు. పథకం కింద అర్హులైన వారి బ్యాంక్ ఖాతాలలో ప్రభుత్వం సొమ్ము జమ చేస్తుందని ప్రకటన రాగానే.. తల్లిదండ్రులు అందరూ తమ పిల్లలు అర్హుల జాబితాలో ఉన్నారా, లేదా అనే వివరాలను సరిచూసుకుంటున్నారు. ఇదే సైబర్ నేరగాళ్లకు అవకాశంగా మారుతోందని కర్నూలు సైబర్ క్రైమ్ పోలీసులు చెప్తున్నారు. తల్లికి వందనం





నిధుల విడుదల నేపథ్యంలో ఈ పథకం పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులను కర్నూలు ఎస్పీ హెచ్చరించారు. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్‌పాటిల్ సూచించారు. సోషల్ మీడియా ద్వారా వచ్చే మోసపూరిత లింకులను నమ్మవద్దని అప్రమత్తం చేశారు. ఇలాంటి లింకులు పంపి బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేస్తారని హెచ్చరించారు. అలాగే అపరిచిత వ్యక్తులతో ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్, ఓటీపీ వంటి వివరాలు పంచుకోవద్దని సూచించారు. తల్లికి వందనం పథకంతో పాటుగా ఏదైనా ప్రభుత్వ పథకాల సమాచారం కోసం సమీపంలోని స్వర్ణగ్రామ, స్వర్ణవార్డు కార్యాలయాలను సంప్రదించాలని కర్నూలు ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు జూలై 22వ తేదీ నుంచి విద్యార్థుల తల్లుల బ్యాంక్ ఖాతాలలో తల్లికి వందనం నిధులను ప్రభుత్వం జమ చేయనుంది. ఇంట్లో స్కూలుకు వెళ్లే పిల్లలు ఎంతమంది ఉంటే.. అందరికీ కూడా ఈ పథకం సాయం అందించనుంది. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి తల్లికి వందనం పథకం కింద రూ.10,120.78 కోట్లు అకౌంట్లలో జమ చేయనుంది. 67,47,190 మంది విద్యార్థులకు ఈ పథకం కింద సాయం అందించనున్నారు. ఒకటవ తరగతి నుంచి ఇంటర్ వరకూ చదివే విద్యార్థు లకు ఈ సాయం అందిస్తారు. కారణాలతో అర్హులై ఉండి కూడా తల్లికి వంద నం పథకం సాయం అందకపోతే జూలై గా క్లియర్ చేయాలని మంత్రి నారా లోకేష్ అధి కారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# అంబటి రాంబాబుపై పరువు నష్టం దావా వేస్తా



**గుంటూరు జిల్లా, జులై 20 :** మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు ) తనపై చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపాలని తెలుగుదేశం పార్టీ గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి డిమాండ్ చేశారు. ఆధారాలు చూపకపోతే ఆయనపై పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. (సోమవారం) గుంటూరు జిల్లాలో మాధవి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. గుంటూరులో మహిళపై జరిగిన ఘటనను రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం దుర్మార్గమని మాధవి పేర్కొన్నారు. ఆధారాలు లేకుండా తనపై ఆరో పణలు చేయడం సరికాదని అన్నారు. అంబటి రాంబాబు విడుదల చేసిన వీడియో పూర్తిగా కల్పిత కథనమని చెప్పుకొచ్చారు. ఈ ఘటనపై వెంటనే స్పందించి చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. నిందితులను వెంటనే అదుపులోకి తీసుకోవాలని పోలీసులను ఆదేశించామని అన్నారు. మహిళల భద్రత విషయంలో తమ ప్రభుత్వానికి ఎలాంటి రాజీ ఉండబోదని గల్లా మాధవి స్పష్టం చేశారు.